ప్రజాశక్తి

గురువారం 1 మే 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

మొన్న వెంకన్న... నేడు అప్పన్న కొండపై..

పోయింది సర్కారు పరువు
అధికార నిర్లక్ష్యానికి ఏడుగురు బలి...



సహాయక చర్యల్లో పాల్గొన్న బృందాలు



మహాలక్ష్మి



వెంకటరత్నం



మహేష్



శైలజ



దుర్గస్వామినాయుడు



మణికంఠ ఈశ్వరశేషు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో సింహాచలేశుని ప్రాంగణం రక్తసిక్తమైంది. ఈ ఏడాది జనవరిలో తిరుపతి వెంకన్న కొండపై తొక్కిసలాటలో ఆరుగురు, తాజాగా సింహాద్రి అప్పన్న కొండపై ఏడుగురు ప్రాణాలు హరీ మన్నాయి. దీంతో బాధితుల ఆర్తనాదాలు ఆకాశాన్నంటాయి. ఏడు కొండలపై ఆరుగురు, అప్పన్న కొండపై ఏడుగురు బలయ్యారన్న మాటలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మంగళవారం అర్ధరాత్రి, బుధవారం తెలతెల్ల వారుతున్న వేళ 3.30గంటలకు విషాధ దుర్ఘటన సింహాచలం కొండపై చందనోత్సవం సందర్భంగా చోటుచేసుకుంది. గాలి వానకు కొండపైగల గోడ కూలి రూ.300 క్యూ లైన్‌లోని భక్తులపై పడిపోవడంతో ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన విశాఖ జిల్లానే కాదు యావత్ రాష్ట్రాన్నే కుదిపేసింది. జనం ఎక్కువైపోయి తిరుపతిలో మాదిరిగా తొక్కిసలాట జరిగిందా అంటే గోడ కూలడంతో ఇంత పెద్ద విపత్తు సంభవించింది. నాణ్యతా లోపం, నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఇటీవల కొండపై 10 రోజుల ముందు ప్రారంభించి ఐదు రోజుల్లోనే నిర్మించిన గోడ తెల్లారుజామున కురిసిన వర్షానికి గోడ పక్క నుంచీ నీరు పారి 12 అడుగుల ఎత్తుగల గోడ దిగువ భాగం డొల్ల అయిపోవడంతో కూలిపోయిందని అధికారులు నిర్ధారించారు. బస్టాండ్ ఎదురుగా వైకుంఠ ద్వారం వైపు ఈ ఘోరం చోటుచేసుకుంది. ఐతే ఎండాకాలం అయినందున భక్తులు ఎండ వేడి తట్టుకోడానికి గోడపై నుంచి వేసిన రేకులు, ఐరన్ పైపులు కూలి గోడపై పడిపోయాయి. గోడ దెబ్బ, అటు ఐరన్ రాడ్లు, రేకుల బరువుకు ఏడుగురు భక్తులు ఊపిరి ఆడకుండా అక్కడికక్కడే మృతిచెందారన్నది స్పష్టమవుతోంది. ఈ ఘటనలో పురుషులు నలుగురు, మహిళలు ముగ్గురు మరణించారు.



రోధిస్తున్న సాఫ్ట్‌వేర్ దంపతుల కుటుంబీకులు

'కూటమి'కి మాయని మచ్చ....

ప్రభుత్వ నిర్లక్ష్యం, పనుల్లో స్వార్థం వెరసి 'కొండ' చరిత్రకు మాయని మచ్చగా నిలిచాయి. పనుల్లో నాణ్యతా లోపం, గోడ నిర్మాణంలో జాగ్రత్తలను గాలికొదిలేయడం వెనుక అవినీతి పరాకాష్టకు చేరినందునే ఈ ఘోరం జరిగింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో తిరుమల కొండపైనా తొక్కిసలాట భక్తుల మరణం, తాజాగా సింహాద్రి అప్పన్న కొండపై ఏడు ప్రాణాలు హరించుకుపోయాయి. దీంతో చంద్రబాబు పాలనా ప్రతిష్ఠ, కూటమి ప్రభుత్వం పరువు పోయినట్టయింది. జిల్లా అధికార యంత్రాంగం సైతం సింహాచలం కొండపై అప్పన్నను దర్శించుకునేందుకు వెళ్లే ప్రజలపై కాకుండా ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికార పార్టీకి చెందిన చోటా నాయకుల సేవలోనే తరించిందన్న విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందించాలని ఆదేశిస్తూ గోడ కూలిన ఘటనపై సమగ్ర విచారణకు



సింహాచలం కొండపై ఘటనా స్థలంలో పర్యవేక్షిస్తున్న హోం మంత్రి అనిత, కలెక్టర్ తదితరులు

మిగతా 2లో..

మృతులు వీరే

మృతిచెందిన వారిలో 1. ఎడ్ల వెంకటరావు (45) పాత అడవివరం ఎపిఆర్ స్కూల్ దగ్గర (విశాఖపట్నం), 2. పత్తి దుర్గా స్వామినాయుడు (33) మాచవరం తూర్పుగోదావరి జిల్లా, 3. పిల్లా ఉమామహేశ్వరరావు (30) చంద్రంపాలెం మధురవాడ, 4. పిల్లా శైలజ (30) చంద్రంపాలెం మధురవాడ, 5. పైల వెంకటరత్నం (50) 6.గుజ్జరి మహాలక్ష్మి (55), 7.కుంపట్ల మణికంఠ ఈశ్వర శేషు (28), మాచవరం, అంబాజీపేట తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వారున్నారు.

మృతులకు రూ.కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగమివ్వాలి : సిపిఎం 4లో

ఎయు విదేశీ విద్యార్థి మృతి

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఆంధ్ర యూనివర్సిటీలో విదేశీ విద్యార్థి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వైఎంసిఎ హాస్టల్లో ఉంటూ ఘనా దేశానికి చెందిన ఇవాన్ ఓబెంగ్ లాటి (29) ఎంబిఎ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం తెల్లవారుజామున సుమారు 3:40 సమయంలో జ్వరం, వాంతులతో ఇబ్బంది పడుతుండటం చూసి తోటి విద్యార్థులు అపోలో ఆసుపత్రిలో

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మొన్న వెంకన్న... నేడు అప్పన్న కొండపై..

ముగ్గురు సభ్యుల (త్రిసభ్య) కమిటీ వేస్తున్నట్లు ప్రకటించారు. మృతులకుటుంబానికి రూ.25లక్షలు, క్షతగాత్రులకు రూ.3లక్షలు ప్రభుత్వం ఇస్తున్నట్లు ప్రకటించారు. అలాగే మృతుల కుటుంబంలో ఒకరికి దేవాదాయ శాఖలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం హామీ ఇచ్చారు.

ప్రముఖుల సంతాపం:

గోడ కూలిన ఘటనపై రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, వైసిపి మహిళా నాయకులు పేడాడ రమణకుమారి, మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అక్కడే ఉండి పరామర్శించని అశోక్...

బుధవారం తెల్లవారు జామున సింహాచలం కొండపై మాన్సాస్ ఛైర్మన్, మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు తొలి పూజలను అందుకోవడానికి విచ్చేసి, ఘటన జరిగిన సమయంలో గుడి లోపలే ఉన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ కనీసం ఘటనా స్థలానికి వచ్చి గోడ కూలి మృతి చెందిన వారిని పరామర్శించలేదని, కొండ దిగి వెళ్లిపోయారన్న చర్చ ఈ ప్రాంత ప్రజల్లో జరుగుతుంది.

ఘటన జరిగిన నుంచీ హోంమంత్రి పర్యవేక్షణ

సింహాచలం కొండపై గోడ కూలి ఏడుగురు భక్తులు మరణించిన విషయం తెలుసుకున్న రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెల్ల వారు జామునే కొండకు చేరుకొని సహాయక చర్యలను అక్కడే ఉండి పర్యవేక్షించారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలవరకూ కెజిహెచ్‌లో ఉన్నారు. పోస్టుమార్టం పూర్తయి భౌతికకాయాలను బంధువులకు అప్పగించేవరకూ ఆమె విశ్రమించకుండా పనిచేసారన్న చర్చ సాగుతోంది.

ఎయు విదేశీ విద్యార్థి మృతి

చేర్పించారు. అతని పరిస్థితి అత్యంత విషమంగా ఉందని అత్యవసర ఇంకుబేషన్ అవసరమని ఆసుపత్రి వైద్యులు సూచించడంతో ఉదయం 5:50 గంటలకు కెజిహెచ్‌కు తరలించారు. 6.10 గంటలకు వైద్యులు పరీక్షించి అప్పటికే అతడు మృతి చెందాడని నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్ మార్చురీకి తరలించారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మురుగు పోయే దారేది?

- రియల్ ఎస్టేట్ వ్యాపారి కాలువను మూసేయడంతో దుర్గంధం

- గ్రామస్తుల అవస్థలు



కాలువలో నిల్వ చేరిన మురుగు నీరు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ కల్లివానిపాలెం గ్రామంలో మురుగు నీరు పోవడానికి దారి లేక ఇళ్ల సమీపంలో నిలిచిపోవడంతో దుర్గంధంతో పాటు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్లివానిపాలెం గ్రామంలో బోర చిట్టి దుర్గయ్య, చిన్న ఎర్రయ్య రెడ్డి ఇంటి దగ్గరలో ఉన్న పెద్ద కాలువ గుండా మురుగు నీరు వెళ్లకుండా చిలుకూరి వారు ప్రహరీ ఏర్పాటుచేశారు. దీంతో గ్రామం మొత్తం మురుగు నీరు ఇక్కడికే వచ్చి ఆగుతుంది. ఈ మురుగు నీరు ఎటు వెళ్లకుండా కాలువలోనే మురుగు కూపంగా తయారైంది. ఇలా నిలిచిపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగాయి. వీటి వలన డెంగీ, మలేరియా, కలరా తదితర వ్యాధులు సోకే అవకాశముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కల్లివానిపాలెం గ్రామం నుంచి మురుగు నీరు కాలువల ద్వారా గంభీరం గెడ్డలోకి వెళ్లేది. ఇటీవల కాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు చిలుకూరు లే-అవుట్ ఏర్పాటుచేసి కాలువలను కప్పేశారు. అప్పట్లో నీరు పోవడానికి దారి లేకపోవడంతో గ్రామస్తులు ఆందోళన మేరకు చిలుకూరి యజమాని శ్రీనివాసరావు కాలువ ఏర్పాటుచేసి గంభీరం గెడ్డలోకి మురుగు నీరు పోయే విధంగా చర్యలు చేపడతానని గత ఏడాది ఏప్రిల్ నెలలో పెద్దమనుషుల సమక్షంలో హామీ ఇచ్చారు. అప్పట్లో మురుగు నీరు పంట పొలాల మీదుగా గంభీరం గెడ్డలోకి పోయేది. ప్రస్తుతం ప్లాట్ యజమాని ప్రహరీ ఏర్పాటుచేయడంతో మురుగు నీరు నిల్వ ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఈ కాలువ నుంచి సుమారు 20 అడుగుల దూరంలో ఉన్న గెడ్డ పైపులకు నీరు పోయేలా చర్యలు చేపడితే నేరుగా గంభీరం గెడ్డలోకి మురుగు నీరు పోయే అవకాశం ఉందని చెబుతున్నారు. గతంలో సమస్య తీవ్రంగా ఉండడంతో గ్రామపంచాయతీ వారు మోటార్‌ను పెట్టి మురుగు నీటిని బయటకు పంపించేవారమని పంచాయతీ కార్యదర్శి చలపతిరావు తెలిపారు. 20 అడుగులు స్థలాన్ని ఖరీదుకైనా ఇవ్వమని చిలుకూరు లే-అవుట్ యజమానిని అడిగామని, స్థలం ఇస్తే అండర్ గ్రౌండ్ ఏర్పాటు చేసి మురుగు నీరు పంపించే విధంగా ఏర్పాటు చేసేవారమని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. చిలుకూరు లే-అవుట్ యజమాని ప్రయివేటు వ్యక్తులకు ప్లాట్‌ను అమ్మడం, ప్రస్తుతం ప్రహరీ ఏర్పాటు చేయడంతో సమస్య జటిలమైందని, యజమానితో మాట్లాడి ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రస్తుతం సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే చిలుకూరు వారు స్పందించి మురుగు నీరు పోయే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మినిస్ట్రీ ఆఫ్ హోంఎఫైర్స్, భారత ప్రభుత్వం 2026 భారత రిపబ్లిక్ డే దినోత్సవం సందర్భంగా పద్మ అవార్డుల పురస్కారం కోసం వివిధ రంగాల్లో ఆర్ట్, సోషల్ వర్క్, పబ్లిక్ ఎఫైర్స్, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, మెడిసన్, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, సివిల్ సర్వీసు, స్పోర్ట్స్ మొదలగు రంగాల్లో అత్యున్నత కృషి, సేవలను అందించిన విశిష్ట ప్రతిభావంతుల నుంచి నామినేషన్లు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నదని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవాలనుకునేవారు ఆన్‌లైన్ పద్ధతిలో మాత్రమే నిర్ణీత నమూనాలో వెబ్‌సైట్‌లో ఆయా రంగాల్లో చేసిన సేవలను ఆధారిత డాక్యుమెంటేషన్‌తో పొందుపరుస్తూ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆయా రంగాలలో, అత్యున్నత కృషి స్వచ్ఛందంగా విశేష సేవలు అందించి జాతీయ,రాష్ట్రీయ అవార్డులు పొందిన, విశాఖపట్నం జిల్లా యువత వెబ్ సైట్: https://awards.gov.in సదరు ప్రతిపాదనలను (ఆన్లైన్ లో చేసిన దరఖాస్తు) ఒక కాపీ జిరాక్స్, సాఫ్ట్ కాపీ జూన్ 10వ తేదీలోగా జిల్లా యువజన సంక్షేమ అధికారి,ముఖ్యకార్యనిర్వాహణ అధికారి, సెట్విస్ కార్యాలయం, యువజన భవన్, మహారాణిపేట, విశాఖపట్నం వారికి సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు కార్యాలయ పనివేళల్లో ముఖ్యకార్యనిర్వాహణ అధికారి, సెట్విస్,జిల్లా యువజన సంక్షేమ వారి కార్యాలయము, యువజన భవన్, మహారాణిపేట, నందు సంప్రదించవలసిందిగా జిల్లా కలెక్టర్ తెలియజేసారు

చందనోత్సవంలో జివిఎంసి సేవలు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి చందనోత్సవములో పారిశుధ్యం నిర్వహణతో పాటు తాగునీరు సమృద్ధిగా ఏర్పాటుచేసి భక్తులకు అవసరమైన సేవలను జివిఎంసి అందించిందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, తాగునీటి విభాగం పర్యవేక్షక ఇంజనీరు కెవిఎన్.రవి పర్యవేక్షణలో పారిశుధ్య పనులు, తాగునీరు అందించినట్లు వివరించారు. 1350 మంది పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం పనులు నిర్వహించి వ్యర్థాలను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించారని పేర్కొన్నారు. పారిశుధ్య పనులు గురువారం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేషనల్ గ్యారెంటీ ఎంప్లాయిమెంట్ యాక్ట్ అమలు చేయాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: అఖిల భారత యువజన సమాఖ్య 17 వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్ అన్నారు. బుధవారం అల్లిపురం సిపిఐ కార్యాలయంలో జాతీయ మహాసభ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ, మే నెల 15 నుంచి 18 వరకు తిరుపతి నగరంలో జాతీయ మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య పరిష్కరించేందుకు అఖిల భారత యువజన సమాఖ్య అలు పెరగని పోరాటం చేస్తోందని, దేశంలో 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటుహక్కు కల్పించడంలో ఎఐవైఎఫ్ పోరాటం చేసిందని గుర్తు చేశారు. భగత్ సింగ్ నేషనల్ గ్యారెంటీ ఎంప్లాయిమెంట్ యాక్ట్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ యువతను ఆదుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇంతవరకు ఇవ్వలేదని, తక్షణమే నిరుద్యోగ భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. తిరుపతి వేదిక జరుగుతున్న జాతీయ మహాసభలలో అనేక సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణకు పిలుపునివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెంగువ అచ్యుతరావు, యు.నాగరాజు,మధురెడ్డి వెంకటనాయుడు,బాలు, రావన శ్రీ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

రెడ్డీస్‌తో సనోఫీ హెల్త్‌కేర్ ఒప్పందం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ప్రపంచ ఇమ్యునైజేషన్ వారం సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ దేశంలో బెఫోర్టస్ ఆర్ (నిర్సెవిమాబ్) అనే ఔషధాన్ని ప్రవేశపెట్టడానికి సనోఫీ హెల్త్‌కేర్ ఇండియాతో ఉత్పత్తికి భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నామని సనోఫీ వ్యాక్సిన్స్ (ఇండియా) అధిపతి నిత్య పద్మనాభన్ తెలిపారు. బుధవారం నగరంలోని ఒక హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మందు నవజాత శిశువులు వారి మొదటి రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ సీజన్‌లో జన్మించిన లేదా ప్రవేశించే శిశువులలో రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ లోయర్ రెస్పిరేటరీ ట్రాక్ట్ డిసీజ్ నిరోధించడానికి ఉపయోగిస్తారు. ఇది 24 నెలల వయస్సు ఉన్న పిల్లలలో కూడా ఇవ్వబడుతుందని తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో న్యాయవాద వృత్తిలో రాణింపు

గీతం న్యాయ కళాశాలలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మధరావు

ప్రజాశక్తి-మధురవాడ : వృత్తిపరమైన పరిజ్ఞానంతోపాటు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకునే ఆత్మవిశ్వాసం ఉంటే యువతరం న్యాయవాదవృత్తిలో రాణించి, ఉన్నత శిఖరాలకు చేరవచ్చునని ఏపి హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కె.మన్మధరావు అన్నారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లాను సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, న్యాయవాద వృత్తిలో నిరంతర విద్యార్థిగా ఉంటూ నూతన అంశాలు, తీర్పులను అర్థం చేసుకుంటూ



జస్టిస్ మన్మధరావును సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రతిభను సాన పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. న్యాయవాద వృత్తిని, వ్యక్తిగత జీవితాన్ని సమతుల్యం చేసుకుంటే పరిపూర్ణత లభిస్తుందన్నారు. అనంతరం న్యాయమూర్తి మన్మధరావును గీతం ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతంరావు సన్మానించారు. కార్యక్రమంలో గీతం లా స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, ఇన్‌చార్జి డైరక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ, సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఐఎంటిసి సభ్యునిగా రాంబాబు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆల్ ఇండియా మోటర్ ట్రాన్స్‌పోర్టు కాంగ్రెస్ (ఎఐఎంటిసి) సభ్యునిగా శొంఠ్యాం పంచాయతీ మిందివానిపాలేనికి చెందిన మణికంఠ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు బోడసింగి రాంబాబు నియమితుల య్యారు. 28న హిమాచల ప్రదేశ్ కుషోలీలో జరిగిన ఎఐఎంటిసి సమావేశంలో కేంద్రరవాణాశాఖ మంత్రి హర్ష మల్హోత్రా, హిమాచల్‌ప్రదేశ్ సిఎం సుకేందర్‌సింగ్ పాల్గొన్న సమావేశంలో అఖిల భారత కమిటీ ఎన్నిక జరిగింది. సమావేశంలో జిఎస్‌టి, టోల్‌ట్యాక్స్, థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ తదితర అంశాలపై చర్చజరిగిందని రాంబాబు తెలిపారు



రాంబాబు

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



ఎన్నికైన న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి-భీమునిపట్నం :స్థానిక బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు మంగళవారం జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్ జనార్ధనరావు, కార్యదర్శిగా కె మంజుల, సంయుక్త కార్యదర్శిగా డి కనకమహాలక్ష్మి, కోశాధికారిగా జి.రామారావు, ఉపాధ్యక్షునిగా బి సూర్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పి.రాజు, వి అరుణ, జి ప్రశాంతి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎస్ సురేష్‌రెడ్డి తెలిపారు నూతన కమిటీని పలువురు న్యాయవాదులు అభినందించారు

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కళాసాహితీ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు బుధవారం ముగిసాయి. ముగింపు సభలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీ, పట్టణ ప్రముఖులు రామకృష్ణానంద పాల్గొనిసంస్థ అధ్యక్షులు పి రాజేంద్రప్రసాద్ వర్మ, నిర్వాహకులను అభినందించారు. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన మైలపల్లి రిషితశ్రీకి జ్ఞాపిక అందజేసి అభినందించారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. స్థానిక కలిగొట్ల స్పిర్ట్ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కె శ్రీరామచంద్రమూర్తి, మాజీ కౌన్సిలర్ ఎం లక్ష్మణరావు, కళా సాహితీ సంస్థ గౌరవాధ్యక్షులు ఆర్ పెదబాబు, సభ్యులు కనకల సన్యాసినాయుడు, కాళ్ల సన్నీ, ఎస్.జోగారావు, సూర్య శ్రీనివాస్ పాల్గొన్నారు

రైలు ప్రయాణికులకు వాటర్ బాటిళ్ల పంపిణీ

ప్రజాశక్తి-ఉక్కునగరం :దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో షాలిమార్ టు వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ భోగీల్లో ప్రయాణికులకు బుధవారం మంచినీటి బాటిళ్లను పంపిణీ చేశారు. మానవ వికాస వేదిక ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌ఎన్ మూర్తి, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ కార్యదర్శి కంచుమూర్తి ఈశ్వర్, మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పి శ్రీనివాసరావు రైల్వే అధికారులు ఎంఎస్ .రావు చంద్రశేఖర్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జాషువా. జీవి.రావు ఆర్.రాజేశ్వరరావు, రమణి, స్ఫూర్తి రాజేశ్వరి పాల్గొన్నారు.

సిపిఐ జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- పెందుర్తి : ఈనెల 10,11 తేదీలలో విశాఖ నగరంలోని మురళీనగర్, ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సిపిఐ 25వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం 97వ వార్డు బర్లనగర్ కాలనీలో జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు ఎందుర్తి మండలకార్యదర్శి ఎన్.ఆసిరి నాయుడు, నాయకులు రమణ, అన్నపూర్ణ, దుర్గారావు, అరుణ, పరశురాం, అనురాధ పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి విశేష కృషి

సత్యనారాయణ ఉద్యోగ విరమణ సభలో వక్తలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఉపాధ్యాయునిగా, హెచ్‌ఎంగా గొట్టిపల్లి సత్యనారాయణ 27 ఏళ్ల పాటు విశేష సేవలు అందించి, విద్యార్థుల ఉన్నతికి కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం మండలంలోని సింగనబంద పంచాయతీ, కృష్ణంరాజు పేట ఎంపియుపి స్కూల్ హెచ్‌ఎంగా ఉద్యోగవిరమణ చేసిన గొట్టిపల్లి.సత్య నారాయణ, అతని సతీమణి మంగమ్మను ఘనంగా సన్మానించారు. అభినందన సభలో జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు మాట్లాడుతూ, సత్యనారాయణ మాస్టారు పని చేసిన ప్రతి చోటా పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ఉన్నతికి కృషి చేశారన్నారు.కార్యక్రమంలో ఎంపిపి, డివిఎస్ఎన్ఎన్ రాజు, సర్పంచ్ జివి నారాయణ, ఎంపిడిఓ ఎన్ హనుమంత రావు, ఎంఇఒఎం శివరాణి, పంచాయతీ



సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న జెడ్‌పిటిసి

కార్యదర్శి , చిట్టివలస సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు , విద్యార్థులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

'నవ జీవన వైతాళికులు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కెఎస్.చలం

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో, రాజమ్ కృష్ణన్ రచించిన 'నవ జీవన వైతాళికులు' పుస్తకాన్ని బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో యుపిఎస్‌సి పూర్వ చైర్మన్ కెఎస్.చలం ఆవిష్కరించారు. బసు పోతన ఆహ్వానం పలికిన సభకు ఉప్పల అప్పలరాజు అధ్యక్షోపన్యాసం చేయగా, శ్రీశ్రీ జయభేరి కవితను సాహితీవేత్త, నాటకకర్త పాలిమేర శెట్టి ప్రాన్సిస్ వినిపించారు.అరసం 90వసంతాలు పూర్తిచేసుకున్న అరసం చరిత్రను ఎస్.హనుమంతరావు వినిపించారు విమర్శకులు ఆచార్య చందు సుబ్బారావు కవితా శైలిని విశ్లేషించగా, ఎయు తెలుగుశాఖ ఆచార్యులు డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.సుధ పుస్తక సమీక్ష చేశారు. పుస్తక ప్రచురణ కర్త, మానవహక్కుల వేదిక కార్యకర్త పోలిశెట్టి రామకృష్ణ ప్రజానాట్య మండలి గుర్చి వివరించారు. సభలో కథారచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డివి.సూర్యారావు, అడపా రామకృష్ణ విశాఖ రచయితల సంఘం అధ్యక్షులు బండి సత్యనారాయణ, కథారచయిత మేడా మస్తాన్ రెడ్డి, పద్యకవి సిహెచ్ చిన సూర్యనారాయణ, రాధారాణి, పరమేశ్వర రావు పాల్గొన్నారు

ఏర్పాట్లలో వైఫల్యమే ప్రమాదానికి కారణం

సింహగిరి దుర్ఘటనపై భక్తుల మండిపాటు

ప్రజాశక్తి- గోపాలపట్నం :చందనోత్సవానికి అధికారయంత్రాంగం చేస్తున్న ఏర్పాట్లలో వైఫల్యమే ప్రమాదానికి కారణమని భక్తులు విమర్శిస్తున్నారు. గతేడాది సైతం సామాన్య భక్తులకు ఇబ్బందులకు గురిచేసిన యంత్రాంగం, మరింత నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఏడుగురు ప్రాణాలు పోయాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు వివిఐపిలకు పెద్దపీట వేసి, సామాన్య భక్తులను మాత్రం గంటల తరబడి ఉచిత బస్సుల్లో పడిగాపులు పడేలా చేశారనే విమర్శలున్నాయి.

ఇది అధికారుల వైఫల్యమే..



చందనోత్సవ ఏర్పాట్లలో అధికారుల వైఫల్యమే ఏడుగురి మరణానికి కారణమైంది. సామాన్య భక్తులకు శీఘ్ర దర్శనానికి అవకాశమిచ్చిన అధికారులు, ముందుచూపుతో ఏర్పాట్లు చేసిఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు. గోడ నిర్మాణంలో నాణ్యతాలోపంతో దైవదర్శనానికి వచ్చిన ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం.

కొట్ల అమ్మాజీ, భక్తురాలు, కుర్మన్నపాలెం

ప్రభుత్వమే బాధ్యత వహించాలి



సింహాచలంలో భక్తుల మరణానికి దేవస్థానం అధికారులు,ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలి. వర్షం కారణంగా గోడకూలి భక్తులపై పడిందని చెప్పడం సరికాదు. శాశ్వతంగా ఉండాల్సిన నిర్మాణాల్లో నిర్లక్ష్యం తగదు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి.

ఇసరపు దేవి, భక్తురాలు, గోపాలపట్నం

ఇది ప్రభుత్వ వైఫల్యమే

గోపాలపట్నం : సింహాచలం చందనోత్సవ ఏర్పాట్లులో ప్రభుత్వం, అధికారుల వైఫల్యానికి అప్పన్నకొండపై ఏడు నిండు ప్రాణాలు బలయ్యాయని గ్రీన్ ఇండియా సొసైటీ సభ్యులు ఆరోపించారు. ఉచిత బస్సులని చెప్పి సామాన్య భక్తుల వాహనాలకు అనుమతులివ్వకుంగా గంటలతరబడి పడిగాపులు పడేలా చేశారు. విచ్చలవిడిగా కారు పాస్‌లు మంజూరుచేసి, వివిఐపిల సేవలో అధికారులు మునిగిపోయి, సామాన్య భక్తుల ప్రాణాలతో చెలగాటమాడారన్నారు. గతేడాది వైఫల్యాల నుంచి గుణపాఠం నేర్చుకోకపోగా, మరింత ఫెయిల్యూర్ అప్రతిష్టను మూటగట్టుకున్నారు.

విషాద ఘటన

గోపాలపట్నం : చందనోత్సవం రోజున సింహాచలంలో గోడకూలిన దుర్ఘటనలో ఏడుగురు భక్తులు దుర్మరణం పాలవ్వడం బాధాకరమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం ప్రమాదస్థలాన్ని సందర్శించారు. ఘటనకు కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఘటన సమాచారం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పరిశీలనకు వచ్చామన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యంతోపాటు, ప్రమాద కారణాలపై సమగ్ర విచారణకు ఆదేశించామన్నారు.

సంతోషమాత ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు ఆరిలోవ కాలనీ, లీలాసుందరయ్యనగర్‌లో అట్టాడ భగవాన్‌దాసు కుమారుడు అట్టాడ సూర్య భగవాన్, ఉష దంపతులు నూతనంగా నిర్మించిన సంతోషమాత ఆలయాన్ని బుధవారం ప్రారంభించారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కుమారుడు ప్రతాప్‌రుద్ర పూజల్లో పాల్గొన్నారు. అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు గాడి సత్యం, ఉపాధ్యక్షులు కొత్తల గోపాల్, కాలనీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు మొక్కల వితరణ

ప్రజాశక్తి-ఆనందపురం : పిఎంశ్రీ కింద ఎంపికై క్రీడామైదానం, కిచెన్‌గార్డెన్ నిర్మాణం పూర్తిచేసుకున్న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విశాఖపట్నం పాండురంగాపురం లయన్స్ క్లబ్ బుధవారం పండ్ల జాతి మొక్కలను వితరణ చేసింది. పాఠశాల హెచ్‌ఎం కెఆర్‌కె.పట్నాయక్‌కు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మంత్రి విజయలక్ష్మి, మాజీ ప్రెసిడెంట్ కంటిమహంతి వరలక్ష్మి 25 జామ, వేప, మామిడి, నిమ్మ మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, వాచ్‌మెన్ అప్పారావు పాఠశాల పరిసరాలలో మొక్కలు నాటారు

చందనోత్సవంలో అపశృతి!



మృతులకు రూ.25 లక్షల పరిహారం

రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత



బాధితుల్ని ఓదారుస్తున్న హోంమంత్రి అనిత

గాలి వాన బీభత్సానికి, సింహాచలం చందనోత్సవం ప్రాంతంలో గోడ కూలి భక్తులు చనిపోవటం దురదృష్టకరమని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు.బుధవారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి కెజిహెచ్ మార్చురీ వద్ద మృతదేహాలను పరిశీలించారు. బాధిత కుటుంబీకులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రాత్రి 2.30 గంటలకు ఘటన జరిగిన వెంటనే సహాయక చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదంలో ఏడుగురు మరణించారని, మరి కొంతమంది గాయపడ్డారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, క్షతగాత్రులకు రూ.3 లక్షలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం తరపున పరిహారం ఇస్తామన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యానికి జిల్లా వైద్యాధికారులకు ఆదేశించామన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ప్రమాదంపై విచారణకు త్రిసభ్య కమిటీ వేశామని, 72గంటల్లో కమిటీ నివేదిక వచ్చాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

మరణంలోనూ మిత్రులిద్దరూ ఒక్కటిగా...

- ఇద్దరు అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసుల మృతి

సింహాచలం అప్పన్న సన్నిధిలో జరిగిన ప్రమాదంలో ఇంటీరియర్ డిజైనర్ పత్తి దుర్గస్వామి నాయుడు (32) సహా అతని స్నేహితుడు కుంపట్ల మణికంఠ ఈశ్వర శేషారావు (29) ప్రాణాలు కోల్పోయారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కొర్లపాటివారిపాలేనికి చెందిన పత్తి దుర్గ స్వామినాయుడు మూడేళ్లుగా విశాఖలోని సీతమ్మదారలో నివాసముంటూ, ఇంటీరియర్ డిజైన్ షాపు నిర్వహిస్తున్నారు. చందనోత్సవానికి వెళ్లి అక్కడ గోడ కూలిన ఘటనలో వీరు మృతి చెందడంపై కొర్లపాటివారిపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్నేహితులిద్దరూ ఒకే ఘటనలో మృత్యువాత పడడం విశేషం.

• సింహగిరిపై గోడ కూలి ఏడుగురు భక్తుల దుర్మరణం
• ఏర్పాట్లలో నిర్లక్ష్యంపై భక్తులతోపాటు పలువురి ఆగ్రహం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ/ కలెక్టరేట్ : చందనోత్సవ వేళ సింహాద్రి అప్పన్న సన్నిధిలో అపశృతి చోటుచేసుకుంది. అప్పన్న నిజరూప దర్శనానికి బుధవారం వేకువజామున భక్తులు రూ.300 ప్రత్యేక దర్శనం క్యూలైన్లలో నిలుచున్న సమయంలో ఇటీవలే నిర్మించిన గోడ ఒక్కసారిగా కూలి భక్తులపై పడడంతో ఏడుగురు మృత్యువాత పడ్డారు. మరో పదిమందికి గాయాలయ్యాయి. ప్రసాదం పథకం కింద సింహాచలం కొండపై జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా గోడను నిర్మించారు. కొండపైన సింహగిరి బస్‌స్టాండ్ నుంచి ఎగువకు వెళ్లేమార్గంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

చందనోత్సవానికి కొన్నాళ్లుగా అధికారయంత్రాంగం చేస్తున్న ఏర్పాట్లలో వైఫల్యమే ప్రమాదానికి కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతేడాది సైతం సామాన్య భక్తులకు ఇబ్బందులకు గురిచేసిన యంత్రాంగం, వాటిని అధిగమించి మెరుగైన ఏర్పాట్లు చేయాల్సింది పోయి, మరింత నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఏడుగురు ప్రాణాలు పోయాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు కొండపైకి దర్శనాలకు వెళ్లేందుకు ప్రయివేటు వాహనాలకు అనుమతి లేదంటూనే, కార్లకు ఇష్టానుసారంగా పాస్‌లు జారీ చేశారని, వివిఐపిలకు పెద్దపీట వేసి, సామాన్య భక్తులను మాత్రం గంటల తరబడి ఉచిత బస్సుల్లో పడిగాపులు పడేలా చేశారనే విమర్శలున్నాయి. ప్రమాదం జరిగి ప్రాణాలు పోయిన తర్వాత హడావిడి నేతలు, అధికారులు ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకుంటే బాగుండేదని పలువురు అంటున్నారు.

మృతులకు రూ.కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగమివ్వాలి : సిపిఎం





బాధితుల్ని పరామర్శిస్తున్న సిపిఎం నేతలు

చందనోత్సవం ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం, బాధిత కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉపాధి కల్పించాలని సిపిఎం జాతీయ కమిటీ సభ్యులు కె. లోకనాథం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెజిహెచ్ మార్చురీ వద్ద మృతుల కుటుంబాలను సిపిఎం నేతలు పరామర్శించారు. బాధితులకు ధైర్యం చెబుతూ, ఓదార్చారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ఒకే కుటుంబంలో నలుగురు మరణించడం అత్యంత బాధాకరమన్నారు. చిన్నపాటి వర్షానికే గోడ కూలిందంటే దాని నిర్మాణంలో నాణ్యతాలోపం, అక్రమాలు ఎంతున్నాయో తెలుస్తోదన్నారు. ఈ అవినీతిలో అధికారులు, ప్రభుత్వం పాత్రపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎనాయకులు ఆర్‌కెఎస్‌వి కుమార్, బి వెంకటరావు, బి. జగన్, ఎం సుబ్బారావు, కె చంద్ర శేఖర్ ఉన్నారు.

అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి

సింహాచలం దేవస్థానంలో చందనోత్సవం సందర్భంగా గోడకూలి ఏడుగురు భక్తులు మరణించడంపై సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తుంది. మృతులకు సంతాపం, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు విడుదల చేసిన ప్రకటనలో ఇటీవల తిరుపతిలో జరిగిన ఘటన నుంచి గుణపాఠం నేర్చుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే తాజా ఘటనకు కారణమన్నారు. చందనోత్సవానికి ముగ్గురు మంత్రులతో వేసిన కమిటీ సక్రమంగా పర్యవేక్షణ లేకే దుర్ఘటన జరిగిందన్నారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు అండ

రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్



పరామర్శిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

పవిత్రమైన సింహాచలంలో ఇలాంటి సంఘటన దురదష్టకరమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుల్లో ఇద్దరు జనసేన క్రియాశీల కార్యకర్తలు ఉన్నారని, వారి మరణం పార్టీకి తీరనిలోటన్నారు. కెజిహెచ్ మార్చురీ వద్ద మృతుడు, జనసేన క్రియాశీలక సభ్యుడు పత్తి దుర్గాస్వామి నాయుడు తండ్రి పత్తి దత్తుడును ఓదార్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సింహాచలం ఘటనపై ఉదయం నుంచి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ సమీక్షిస్తున్నారన్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తామని, మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.. సంఘటనపై పూర్తి విచారణ జరిపిస్తున్నామన్నారు

సింహాచలం దుర్ఘటన దురదృష్టకరం

అనకాపల్లి : సింహాచలం కొండపై చందనోత్సవం వేడుకల నేపథ్యంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందడం చాలా దురదృష్టకరమని అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ అన్నారు. మృతులకు జనసేన కార్యాలయంలో సంతాపం తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

మృతుల్లో స్టీల్ ప్లాంట్ ఉద్యోగి

సింహాచలం ప్రమాద సంఘటనలో అడవివరానికి చెందిన ఎడ్ల వెంకటరావు (58) మృతి చెందారు. మతుడు స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్ విభాగంలో పర్మినెంట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. అతని భార్య రత్నకుమారి నగరంలోని ప్రముఖ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తున్నారు. వెంకటరావు మృతితో అడవివరంలోనూ, స్టీల్‌ప్లాంట్‌లోని సంబంధిత విభాగంలో విషాదం అలుముకుంది. మృతునికి ఇద్దరు కుమారుల్లో ఒకరు డాక్టర్, మరొకరు ఇంజినీరుగా బెంగళూరులో స్థిరపడ్డారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే దుర్ఘటన

- మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్

చందనోత్సవంలో దుర్ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యమే కారణమని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు. కెజిహెచ్ మార్చురీ వద్ద మృతుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, సింహాచలం చందనోత్సవానికి ఆంధ్రాతో పాటు ఒడిశా, తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుంచి మూడు లక్షల వరకు భక్తులు వస్తారని తెలిసినా, ఏర్పాటల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. కేవలం మూడు, నాలుగు రోజుల క్రితం కట్టిన గోడల పక్కనే క్యూలైన్లు ఏర్పాట్లు నిర్లక్ష్యమేనన్నారు. ఘటన జరిగిన ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఏం జరిగిందో భక్తులు తెలుసుకోలేని పరిస్థితి నెలకొనడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రశ్నిస్తే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించడం సరికాదని, మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేసారు. బాధిత కుటుంబీకులను పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, తైనాల విజయ్ కుమార్, వైసిపి జిల్లా అధ్యక్షుడు కెకె.రాజు, విజయనగరం జెడ్‌పి చైర్మన్ చిన్న శ్రీను, డిప్యూటీ మేయర్లు జియాని శ్రీధర్, కట్టమూరి సతీష్, ద్రోణంరాజు శ్రీవాస్తవ్, కొండ రాజీవ్, రవిరెడ్డి, పేడాడ రమణకుమారి పాల్గొన్నారు.



కెజిహెచ్ వద్ద బాధితులతో మాట్లాడుతున్న వైసిపి నేతలు

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం

- మృతుల్లో యువ దంపతులిద్దరూ ఐటి ఉద్యోగులు

మధురవాడ : సింహాచలం చందనోత్సవ దర్శనాలకు వెళ్లి గోడ కూలిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. వీరిలో చంద్రంపాలేనికి చెందిన యువ దంపతులు పిల్లా ఉమామహేశ్వరరావు (30), అతని భార్య శైలజ (26) మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. చందనోత్సవం సందర్భంగా సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనానికి వేకువజామున రెండు గంటలకే రూ.300 టిక్కెట్ల ప్రత్యేక దర్శనం క్యూలైన్లలో ఉండగా, ఒక్కసారిగా గోడ కూలి వారిపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు.ఉమామహేశ్వరరావు, శైలజ దంపతులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. ఉమామహేశ్వరరావు హైదరాబాద్ హెచ్‌సిఎల్‌లో పనిచేస్తుండగా, శైలజ మధురవాడ ఇన్ఫోసిస్‌లో పనిచేస్తూ ఇద్దరూ వర్క్ ఫ్రం హోం విధులు నిర్వరిస్తున్నారు.

మూడేళ్ల క్రితమే వివాహమైన యువ దంపతులు మృతితో కుటుంబసభ్యులతోపాటు స్థానికులు విషాదంలో మునిగిపోయారు.

మృతుడు ఉమామహేశ్వరరావు తల్లిదండ్రులు అప్పలనాయుడు శాంతిలకు ఇక కొడుకు, కుమార్తె. పదేళ్ల క్రితం పెళ్లి చేసిన కూతురి భర్త అకాలమరణం చెందగా, ఇపుడు ఏకైక కొడుకు మరణించడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇదే ప్రమాదంలో శైలజ తల్లి పైలా వెంకటరత్నం, మేనత్త గుజ్జారి మహాలక్ష్మి మృతి చెందడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు గా విలపిస్తున్నారు

విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలి

- కలెక్టరేట్ వద్ద ధర్నా
-అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్ఎ)కు పే స్కేల్ అమలు చేయాలని, అర్హులకు ప్రమోషన్లు కల్పించాలని కోరుతూ ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.లోకనాథం మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు బ్రిటిష్ కాలం నుండి పనిచేస్తున్నారని, ప్రభుత్వ భూములు పరిరక్షణ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ తమ సేవలను అందిస్తున్నారని తెలిపారు. గ్రామ సేవకులకు గౌరవ వేతనం పేరుతో అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని వాపోయారు. నెలకు రూ.10,500 జీతంతో గ్రామ సేవకులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. రెవెన్యూ సర్వేలు, రీసర్వేలు పేరుతో రానుపోను చార్జీలకే ఖర్చు అవుతుందని, గతంలో డిఏ ఇచ్చేవారని, నేడు దానిని రద్దు చేయడంతో ఇప్పుడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం మాదిరి వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు వారి సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు మాట్లాడుతూ విఆర్‌ఎల చేత రాత్రిపూట నైట్ వాచ్‌మెన్లుగా రెవెన్యూ కార్యాలయాల్లో పని చేయిస్తున్నారని తెలిపారు. ఇటీవల డ్యూటీలో ఉండగా కశింకోటలో వీఆర్ఏ గుండెపోటుకు గురయ్యారని, ఎటువంటి ఉత్తర్వులు లేకుండా నైట్ డ్యూటీలు వేయడం అన్యాయమన్నారు. వెంటనే నైట్ వాచ్మెన్ ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే.రవికుమార్, ఎన్.గంగాధర్, జిల్లా కోశాధికారి సంతోష్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతి కుమారి, తోటాడ సింహాచలం, పరదేశి నాయుడు, వీ.రమణ, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.లోకనాథం

ఆస్క్ క్యాంపస్ డ్రైవ్‌లో 64 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఆస్క్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. కేవీబి స్టాఫింగ్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు నిర్వహించిన ఈ క్యాంపస్ డ్రైవ్ లో 120 మంది విద్యార్థులు పాల్గొనగా 64 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శిరీష పేర్కొన్నారు. ఒక్కొక్కరు రెండు లక్షల 40 వేల నుంచి 2 లక్షల 60 వేల రూపాయల ప్యాకేజీకి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కెవిబి స్టాఫింగ్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్ ఆర్ బి రామారావు, అసిస్టెంట్ హెచ్ఆర్ మనోజ్ కుమార్, టెక్నికల్ హెడ్ పవన్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి నవ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి అభివృద్ధికి రూ.50వేల కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

అమరావతి అభివద్ధికి 50 వేల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంటా శ్రీరామ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ రాజధాని పనుల పున:ప్రారంభానికి వస్తున్న నేపథ్యంలో పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిలను పోలీసులు అడ్డుకొని హౌస్ అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో దీక్ష చేస్తున్న షర్మిలపై బిజెపి కార్యకర్తలు కోడిగుడ్లతో దాడి చేయడం దారుణమని, అప్రజాస్వామికమని పేర్కొన్నారు. 2015లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శంఖుస్థాపన చేసి రాష్ట్రానికి చెంబుడు నీళ్ళు, గుప్పెడు మట్టి తప్ప నిధులేమీ ఇవ్వలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అమరావతి రాజధానికి ఇచ్చిన అప్పుల స్థానే గ్రాంటుగా ఇచ్చేందుకు ప్రధాన మంత్రితో ప్రకటన చేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం నేత శ్రీరామ్ డిమాండ్ చేశారు.

గాలివాన బీభత్సం

నేలపాలైన మామిడి కాయలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మంగళవారం రాత్రి, బుధవారం మధ్యాహ్నం మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురు గాలులతో వర్షం కురవడంతో అనేక చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. మంగళవారం రాత్రి కురిసిన గాలివానకు మండలంలోనిమ పింద్రంగి. లంకవానిపాలెం, కొరువాడ, డి.అగ్రహారం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చౌడువాడ, పైడంపేట, పాచిలవానిపాలెం, మల్లంపాలెం గ్రామాల్లో కోత దశకు వచ్చిన దాల్వా వరి పంట గాలివానతో కొంత నీట మునిగినట్లు రైతులు చెప్పారు. మెట్ట ప్రాంతాలైన సూదివలస, మర్రివలస, శృంగవరం, గొట్లాం గ్రామాల్లో వందలాది ఎకరాల్లో ఉన్న మామిడి తోటల్లో మామిడి కాయలు నేలరాలిపోయాయి. దీంతో మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. సరుగుడు,. యూకలిప్టస్ తోటలకు మాత్రమే ఉపయోగమని రైతులు చెబుతున్నారు.

సబ్బవరం : మండలంలోని బుధవారం కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. సబ్బవరంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఎన్టీఆర్ సర్కిల్, పాత సబ్బవరం జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, పోలీస్ స్టేషన్‌లు వర్షం నీటికి ముంపునకు గురయ్యాయి. దీంతో ఆయా కార్యాలయాల సిబ్బంది, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు రానున్న వర్షాకాలంలో మరింత ఇబ్బందులు అయ్యే అవకాశాలు ఉన్నాయని, తక్షణమే సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సబ్బవరం ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద రోడ్డుపైకి వచ్చిన మురుగునీరు



చెరువును తలపిస్తున్న మునగపాక సంతబయలు ప్రాంతం

19.4 మిల్లీమీటర్ల వర్షపాతం

యలమంచిలి : బుధవారం మధ్యాహ్నం 3.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు వర్షం కురిసింది. ఈ వర్షం రెవెన్యూ రికార్డుల్లో 19.4 మిల్లీమీటర్లగా నమోదైందని అసిస్టెంట్ స్టేటిస్టిక్స్ అసిస్టెంట్ సునీతాదేవి తెలిపారు. వర్సంతో పట్టణ ప్రజలు కాస్త సేద దీరారు.

మునగపాక : మండల కేంద్రం మునగపాకలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. వేసవి తాపంతో అల్లాడుతున్న జనాలు ఈ వర్షంతో సేద తీరారు. ఉరుములు, మెరుపులతో పాటుగా ఈదురుగాలులు వీయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తహశీల్దారు, కార్యాలయం, సంత బయలు, నందికుడి ప్రాంతాలు వాన నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు, ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అనకాపల్లి రూరల్ : గవరపాలెం నూకాలమ్మ ఆలయానికి వెళ్లే రహదారి వర్షం నీటికి చెరువులా మారింది. చిన్నపాటి వర్షానికే తోటాడ హైవే ఆర్చి వద్ద రహదారి మొత్తం నీటితో నిండిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రహదారిపై నీటితో భక్తులకు ఇబ్బందిగా మారింది. కనీసం ఆ నీటిని తొలగించే పనిని కూడా ఎవరు చేపట్టకపోవడం గమనార్హం.

కశింకోట : కశింకోట మండలంలో బుధవారం ఉదయం ఎండ సాయంత్రం 3 గంటలకు వర్షం కురసింది. ఎండవేడికి అల్లాడుతున్న ప్రజలు ఈదురుగాలులతో ఉపశమనం పొందారు.

ఇళ్లలోకి వర్షపు నీరు

డొంకాడ దళిత కాలనీలో తక్షణం

డ్రెయినేజీలను శుభ్రం చేయాలి : సిపిఎం

నక్కపల్లి : మండలంలోని డొంకాడ ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉండటంతో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. వర్షపు నీరు, మురుగునీరు కలిసి ఇళ్లల్లోకి రావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లల్లోకి ప్రవహించిన వర్షపు నీరును కాలనీ వాసులు బయటకు తోడారు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉండటంతో మురికి నీరు కాలువలో నిలిచిపోతుందని, కాలువనిండా చెత్త పేరుకు పోయిందని పట్టించుకునే నాధుడే కరువయ్యారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వచ్చినప్పుడల్లా ఇదే పరిస్థితి ఎదురవుతుందని ఆవేదన వెలబుచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు మాట్లాడుతూ, ఈనెల 5వ తేదీన కాలనీ వాసులతో కలిసి అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీలు పరిశీలించడం జరిగిందన్నారు. డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకు పోయి, కాలువ పూడిక పోవడంతో మురుగునీరు బయటకు వెళ్లే పరిస్థితి కనిపించలేదని, అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసినప్పటికీ, నేటి వరకు స్పందించలేదని పేర్కొన్నారు. సోమవారం, బుధవారం సాయంత్రం కురిసిన కొద్దిపాటి వర్షానికి ఇళ్లల్లోకి నీరు ప్రవహించడంతో కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడ్డారన్నారు. పెద్ద వర్షం పడితే మరింత ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందని, వెంటనే అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని డిమాండ్ చేశారు.



ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు

ప్రశాంతంగా పాలిసెట్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లావ్యాప్తంగా బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా జరిగింది. పాలిసెట్ పరీక్షకు జిల్లాలో 9049 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 8512 (94శాతం) మంది విద్యార్థులు హాజరైనట్టు జిల్లా పాలిసెట్ సమన్వయకర్త ఐవిఎస్.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. వీరిలో బాలురు 4974 (95.3 శాతం), బాలికలు 3538 (92.5 శాతం) హాజరయ్యారు. అనకాపల్లిలో ఏర్పాటు చేసిన 14 కేంద్రాల్లో మొత్తం 6216 (94.33 శాతం) మంది హాజరు కాగా వారిలో 3602 (95.6 శాతం) బాలురు, 2614 (92.7 శాతం) మంది బాలికలు ఉన్నారు. నర్సీపట్నంలో ఏర్పాటు చేసిన 9 సెంటర్లలో మొత్తం 2296 (93.3 శాతం) మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారిలో 1372 (94.4 శాతం) మంది బాలురు, 924 (91.8 శాతం) మంది బాలికలు ఉన్నారు. కేంద్రాల్లో విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 23 సెంటర్లలో పాలిసెట్ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్టు శ్రీనివాసరావు తెలిపారు.

భీమునిపట్నం : భీమిలిలో ఆరుపరీక్షా కేంద్రాల్లో పాలిసెట్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. 1148మంది విద్యార్థులకు1086 మంది (94.58 శాతం)హాజరయ్యారని స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ మురళీకృష్ణ తెలిపారు. విశాఖ పాలిటెక్నిక్ విభాగం నుంచి జిల్లా పరిశీలకునిగా అకడమిక్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె విజయభాస్కర్, ప్రత్యేక పర్యవేక్షకునిగా డాక్టర్ పిఎం.భాషా , అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా జి.రాజేశ్వరి వ్యవహరించారు.

ఆక్రమణ తొలగింపులో ఉద్రిక్తత

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం జంక్షన్ వద్ద గౌతమివాని చెరువు గట్టుపై ఆక్రమణ తొలగింపులో ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మురవరపు సతీష్ చెరువుగట్టుపై స్థలాన్ని ఆక్రమించి పాక కట్టడంతో స్థానిక తహసీల్దార్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు బుధవారం సాయంత్రం ఆ పాకను తొలగించడానికి ప్రయత్నించారు. దీంతో ఆక్రమణదారుడు రెవెన్యూ అధికారులతో వాగ్వివాదం చేశాడు. సదరు చెరువు గట్టును అనుకొని అనేక నిర్మాణాలు ఉన్నాయని వాటి అన్నిటినీ తొలగించాలని రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగాడు. పరస్పరం తోపులాట చోటు చేసుకుంది. రెవెన్యూ అధికారులు నిర్మాణాన్ని తొలగించారు.

ఆర్ఇసిఎస్ ఉద్యోగులకు పిఆర్‌సి మంజూరు

ప్రజాశక్తి- అనకాపల్లి : కశింకోట ఆర్ఇసిఎస్ పర్మినెంట్ ఉద్యోగస్తుల పిఆర్‌సి మంజూరైనటు తుమ్మపాల ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరికి పిఆర్సి చాలా కాలంగా అమలు చేయకుండా ఉంది. దీనిపై అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయానంద్కి, ఏపీ ఈపీడీసీఎల్ సిఎండితో ప్రత్యేకంగా చర్చించి 113 పర్మినెంట్ ఎంప్లాయిస్‌కు పిఆర్సి అమలు చేయించినట్లు చెప్పారు. పిఆర్‌సి ఎరియర్స్ మూడు నాలుగు వాయిదాలలో చెల్లిస్తారన్నారు. ఆర్ఇసిఎస్ అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న 350 మంది ఉద్యోగులకు జీతభత్యాలలో అనేక తేడాలు ఉన్నాయని, అప్పటి ప్రభుత్వంలో కొంతమంది పెద్దలకు ఇష్టమైతే 40 వేలు, మిగతా వారికి 15000 వేతనం ఇస్తున్నారని అందరికీ ఒకే పద్ధతిలో అందేవిధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వయోజన విద్యకు 'ఉల్లాస్' ఊతం

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఉల్లాస్' కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు తెలిపారు. కలెక్టరేట్లోని తన చాంబర్లో బుధవారం ఉల్లాస్ కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లాస్ పథకంపై ప్రచారం ద్వారా అవగాహన కల్పించాలని, జిల్లాకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని కోరారు. 2025-26 సంవత్సరానికి 24,977 మందికి వయోజన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్ష్యరాస్యత శాతం తక్కువగా గల మండలాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. దీని విజయవంతం చేయడానికి పంచాయతీరాజ్, గ్రామ సచివాలయం, గ్రామీణాభివద్ధి, మహిళా శిశు సంక్షేమం, విద్యాశాఖ అధికారుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పథకానికి సంబంధించి సరఫరా చేసిన పుస్తకాలలోని పాఠాలను నిరక్షరాస్యులకు బోధించి, ప్రాథమిక అవగాహన పెంచాలని డిఆర్‌ఓ వై.సత్యన్నారాయణరావు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వయోజన విద్య సహాయ సంచాలకులు డి.చిన్నికృష్ణ, కమిటీ సభ్యులు డీఆర్డీఏ పీడీ కె.శచీదేవి, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి ఎస్.మంజులవాణి, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి అనంతలక్ష్మి, ఇతర సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అదాని హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణానికి ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

చింతలపూడిలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని చింతలపూడి, మారిక గ్రామాల మధ్య అదాని హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణం కొరకు ఇచ్చిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన చింతలపూడి గ్రామస్తులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అడవులను తాకట్టు పెట్టడానికి, గిరిజనులు బతుకులు నాశనం చేయడానికి అడవి బాట పట్టినట్లు ఉందని పేర్కొన్నారు. చింతలపూడి పంచాయతీలో శారదానదిపై ప్రాజెక్టులు నిర్మించడం ద్వారా పంపుంగ్ చేసి వేపాడ మండలం కరక వలస పంచాయతీ శవారు మారికలో 30 సర్వే నెంబర్లులో 213 ఎకారాలలో హైడ్రోపవర్ పవర్ ప్లాంటు నిర్మాణం చేయడానికి ప్రయత్నించడాన్ని గిరిజనులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎటువంటి పనులు చేపట్టాలని చూసినా తీవ్రమైన ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో హైడ్రోపవర్ ప్లాంటు పెట్టొద్దని కొంత కాలంగా గిరిజనులు ఆందోళన చేస్తుంటే మరో పక్కన అనుమతులు ఇవ్వడానికి రహస్యం సర్వేలు చేసి, ఇప్పుడు అడ్డగోలుగా అనుమతి ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వని ప్రభుత్వం దట్టమైన అటవీ ప్రాంతాన్ని అదానికి ఎలా కట్టబెడుతున్నారని ప్రశ్నించారు? ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే రైవాడ ఆయకట్టు రైతుల భూములు బీడుబారిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైవాడ రిజర్వాయర్ ఆయకట్టు కిందన ఉన్న గ్రామల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నీటి సంఘాల ఛైర్మన్లు ఇతర స్థానిక ప్రజా ప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా రైతులను చైతన్యం చేసి ఈ ప్లాంట్‌ను అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న చింతలపూడి గిరిజనులు

తడి, పొడి చెత్తతో సంపద సృష్టి : డిపిఒ

ప్రజాశక్తి-కశింకోట : తడి, పొడిచెత్త నుంచి సంపద సృష్టికి అవకాశం ఉందని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి అన్నారు. కశింకోటలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెల్లో సంపూర్ణ పారిశుధ్య పనుల నిర్వహణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇంటింటా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పంచాయతీలు మరింత ఆదాయం పొందేలా కార్యాచరణ ఉంటుందన్నారు. ప్రభుత్వ సంకల్పానికి ప్రజా చైతన్యం తోడైతే పల్లెల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం నిర్వహణ సాధ్యమని పేర్కొన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి దానిలో తడి చెత్తను పంచాయతీ సిబ్బందికి అందజేస్తే దాన్ని సంపద కేంద్రానికి తరలించి అక్కడ సేంద్రియ ఎరువు తయారీకి వినియోగిస్తారన్నారు.. సంపద కేంద్రాల పని తీరు, వర్మి కంపోస్టు సేంద్రియ ఎరువు తయారీపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈఒపిఆర్‌డి ఎం. వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షేక్ రవీద్ బాషాకు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎలమంచిలి టౌన్‌పోలీస్‌స్టేషన్‌లో అదనపు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న షేక్ రవీద్ బాషా ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా బుధవారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సూచనలతో ఆయనను ఘనంగా సన్మానించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు, సహచరులు పాల్గొని ఆయన చేసిన విశేషసేవలను కొనియాడారు. జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ మాట్లాడుతూ బాషా తన 38 సంవత్సరాల సుదీర్ఘ పోలీస్ సేవలో చూపిన అంకితభావం, నిబద్ధత, పట్టుదల పోలీసు శాఖకు ఆదర్శంగా నిలిచాయన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఏవో ఏ.రామకుమార్, సీఐలు లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు, లక్ష్మీ, ఎస్సైలు వెంకన్న, సురేష్‌బాబు, విశ్వనాథం,శేషగిరిరావు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా ఎన్‌హెచ్ఎంజెఎసి ఆధ్వర్యంలో కంటింజెంట్ వర్కర్ల సమస్యలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం బుధవారం వద్ద నిరసన తెలియజేసి అనంతరం డిఎంహెచ్ఓ ఆఫీస్ సూపరింటిండెంట్ శేషుకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ కంటింజెంట్ వర్కర్స్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 20 నుండి 30 సంవత్సరాల పైబడి సేవలందిస్తున్నారని, వారి సర్వీసును రెగ్యులరైజ్ చేయమని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26వే లు అమలు చేయాలని, ఎనిమిది గంటలు పని వేళలు అమలు చేయాలని, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అమలు పరచాలని, షిఫ్ట్‌డ్యూటీ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎం జేఏసీ సభ్యులు రామకృష్ణ, సూరప్పారావు, లక్ష్మి, పీహెచ్సీల కంటింజెంట్ వర్కర్స్ పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీ సమ్మంగిపాలెంలో చట్టాలు, పౌరహక్కులపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పరవాడ బాలికల ఎస్సీ వసతి గృహం వార్డెన్ సుజాత, రెవెన్యూ అధికారి వీఆర్వో అప్పారావు హాజరై మాట్లాడారు. పౌర హక్కులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలగూర్చి, రాజ్యాంగంలో ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన రిజర్వేషన్లు గురించి వచ్చే అవకాశాలు వివరించారు. కుల మతాలకు అతీతంగా కలిసి ఉంటేనే పౌరహక్కులను సమానంగా అందరూ అనుభవిస్తారన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు కణితి చినసోమేశ్వరరావు. అంగన్‌వాడీ కార్యకర్త ముత్యాలమ్మ, వీఆర్ఏలు శివలంక అర్జున్ రావు, సమ్మంగి లోవరాజు, ఈరుగుల రవి, అంగన్‌వాడీ, ఆశ. వెంకటలక్ష్మి, వాడమొదల గాంధీ కణితి పరదేశి పాల్గొన్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గొర్లెవానిపాలెం పంచాయతీ బీసీ కాలనీలో బుధవారం సర్పంచ్ గొర్లె గోపి అమ్ములు ఆధ్వర్యంలో డ్రైనేజీ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పంచాయతీ నిధులతో బీసీ కాలనీ ప్రధాన రహదారికి ఇరువైపులా సిసి రోడ్డు విస్తరణ, కాలనీ ప్రధాన రహదారి వద్ద నుండి బైలపూడి నారాయణ ఇంటి వరకు డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ షణ్ముఖ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకటరావు, వైసిపిగ్రామ కమిటీ అధ్యక్షులు రొంగలినాయుడు, చిప్పాడ రామారావు, పైల అప్పారావు, బయలపూడి గంగరాజు పాల్గొన్నారు.

గర్భిణులు, పిల్లలతో సిహెచ్‌ఒల ధర్నా



గర్భిణులు, పిల్లలతో నిరసన తెలుపుతున్న సిహెచ్‌ఒలు

ప్రజాశక్తి-అనకాపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ధర్నాలో భాగంగా బుధవారం తమ పిల్లలు, గర్భిణులతో కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ ఆయుష్మాన్ ఆరోగ్య మిషన్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సిహెచ్ఓ)ను ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం ఆరేళ్ల దాటిన తరువాత క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలని, ప్రతి సంవత్సరం 5శాతం ఇంక్రిమెంట్, పని ఆధారిత ప్రోత్సాహకాలు, ఈపిఎఫ్ఓ పునరుద్దరించాలని, ఎఫ్ఆర్ఎస్ నుండి సిహెచ్ఓలను మినహాయించాలని తదితర డిమాండ్లపై ఈ ఆందోళన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 28 నుంచి సమ్మెలో జిల్లాలోని 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిహెచ్ఓలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా కోశాధికారి, వి.వి. శ్రీనివాసరావు సంపూర్ణ మద్దతును తెలియజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సిహెచ్ఓలు జి భవాని, పి రేవతి, జి యమున, కె అశ్విని, టి కళ్యాణి, బి. సుధాకర్, ఆర్. అప్పలనాయుడు, పి.రాజశేఖర్, సి హెచ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లలో మున్సిపాలిటీకి పదో స్థానం

ప్రజాశక్తి-యలమంచిలి : పన్నులు వసూళ్లలో రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో యలమంచిలి మున్సిపాలిటీ పదో స్థానంలో నిలవడం గర్వకారణమని అందుకు కృషిచేసిన సచివాలయ, రెవెన్యూ సిబ్బందిని మున్సిపల్ కౌన్సిల్ అభినందిస్తూ తీర్మానించింది. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన జరిగింది. గత ఏడాది 76.39 శాతం మాత్రమే పన్నులు వసూలు చేయగా, ఈ ఏడాది ముందస్తు ప్రణాళిక ప్రకారం రెవెన్యూ వసూళ్లపై దృష్టి సారించి 89.90 శాతం పన్నులు వసూలు చేశామని కమిషనర్ బిజెఎస్ ప్రసాదరాజు కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. ముందుగా ఉగ్రదాడికిలో మృతి చెందిన వారికి, సింహచలంలో మృతి చెందిన భక్తులకు సంతాపం తెలియజేస్తూ 2 నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం గత సమావేశంలో 2025 - 2026 అంచాలతో ప్రవేశపెట్టిన పరిపాలనా విభాగం, ఇంజనీరింగ్ విభాగం, ప్రజారోగ్యశాఖ విభాగం, ప్రణాళికా విభాగం, రెవెన్యూ విభాగం విడివిడిగా సమర్పించిన బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. కమిషనర్ మాట్లాడుతూ వేసవిలో చలువ పందిళ్లు నిర్మిస్తామన్నారు. ఫిబ్రవరిలో లక్ష రూపాలయతో బోర్లు బాగుచేయడం జరిగిందన్నారు. సాలిడ్ వేస్ట్ గురించి తిరుపతి మున్సిపాలిటీలో ప్రయోగం జరుగుతోందని, ఆ వివరాలు పరిశీలించి ఇక్కడ కూడా అమలుకు ప్రయత్నిస్తామని చెప్పారు. మున్సిపాలిటీ పెంచిన మొక్కల్ని నిర్లక్ష్యంగా విద్యుత్‌శాఖ నరికి వేయడంపై ఛైర్‌పర్సన్ మండిపడ్డారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ గుప్తా ఒక్కరే ప్రశ్నలు లేవనెత్తారు. కార్యక్రమంలో 14మంది కౌన్సిలర్లు, అధికారులు ఇంజనీరింగ్ విభాగం నానాజీ, సుబ్బారావు, శానిటరీ పల్లా శ్రీనివాస్, రెవెన్యూ విశ్వేశ్వరరావు, టౌన్ ప్లానింగ్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ స్థలంలో అక్రమ నిర్మాణాలు

చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి- పరవాడ

మండలంలోని గ్రేటర్ విశాఖ 79వ వార్డు దేశపాత్రునిపాలెంలో ప్రైవేట్ లేఅవుట్‌లోని స్కూలు కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని బుధవారం నిర్వాసితులు కొల్లి వెంకటరమణ రమాదేవి దంపతులు తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశపాత్రునిపాలెం రెవెన్యూ సర్వే నంబర్లు 128 /సి, 133/సి నుండి 137, 138/సి, 140 337లలో 1984లో ఉడా ఏప్రిల్‌తో ఎల్పీ నెంబర్ 25/84లో సుబ్రహ్మణ్యనగర్ పేరుతో లేఅవుట్ వేశారని తెలిపారు. ఈ లేఅవుట్లలో అక్కడక్కడ పార్కులకు, పాఠశాలల నిర్మాణానికి 4-31 ఎకరాల ఖాళీ స్థలాలను ఉంచారని పేర్కొన్నారు. పాఠశాల నిర్మాణానికి వదిలిన సుమారు ఎకరా స్థలంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇళ్ల నిర్మాణం చేపట్టారని తెలిపారు. దీనిపై జివిఎంసి కమిషనర్, కలెక్టర్, ఆర్డీఒ, తహశీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయినా వారు రాజకీయ ఒత్తిళ్లకు లొంగి పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి గ్రామపెద్దలు మచ్చ శివ, మాజీ సర్పంచ్ జోగినాయుడు, జనసేన 79వ వార్డు అధ్యక్షులు పిల్లశివ, సిపిఎం నాయకులు వివి రమణ, జనసేన గ్రామమహిళ జ్యోతి, ఈశ్వరమ్మ, టిడిపి నాయకులు కర్రం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి

ప్రజాశక్తి- మునగపాక : స్థానిక గ్రామీణ యువజన మందిరం ఆధ్వర్యంలో తెలుగు కవి, రచయిత శ్రీరంగం శ్రీనివాసరావు జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు కళాకారులు శ్రీశ్రీ రాసిన కవితలను సభలో ఆలపించారు. అనంతరం గ్రామీణ యువజన మందిరం కోశాధికారి ఆడారి లక్ష్మణరావు ఆర్థిక సహకారంతో కళా ప్రోత్సాహకులు, నటులు, కందుకూరి వీరేశలింగం (2025) అవార్డు గ్రహీతలు పిసిహెచ్ నాయుడు, డి శివాజీలను సత్కరించారు. కార్యక్రమంలో యువజన మందిరం గౌరవ అధ్యక్షులు సూరిశెట్టి రాము, పీవీ సీతారాం, అధ్యక్ష, కార్యదర్శులు ఆడారి శ్రీకాంత్, సూర్యచంద్ర రామారావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు టెక్కలి పరశు రాం, కళాకారులు, ప్రోత్సాహకులు కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట రాము, టెక్కలి కొండలరావు, బుద్ద వెంకట్, సూరిశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట వెంకట్, పెంటకోట శివ గణేష్, ఆడారి కాశిబాబు తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షను వ్యతిరేకించిన బసవేశ్వరుడు

ప్రజాశక్తి-అనకాపల్లి : లింగ వివక్షను వ్యతిరేకించిన అభ్యుదయవాది మహాత్మ బసవేశ్వరుడని కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్లోని మినీ మీటింగ్ హాల్‌లో బుధవారం బసవేశ్వరుని894వ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హైందవ మతాన్ని సంస్కరించిన ప్రముఖుల్లో బసవేశ్వరుడు ఒక్కరన్నారు. ఇతనిని బసవన్న, బసవుడు, విశ్వ గురువని పిలుస్తారని తెలిపారు. అన్నమయ్య, వేమన, వీర బ్రహ్మం భావాలలో విప్లవాత్మక మార్పులు రావడానికి పరోక్షంగా బసవేశ్వరుడే కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఇంచార్జి ఏవో వాసు నాయుడు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ప్రజాశక్తి-దేవరాపల్లి: మండలంలోని ఏ.కొత్తపల్లి స్మశాన వాటికలో 15వ ఆర్థిక సంఘం నిధులతో శవదహనవాటిక, ప్రహరీ నిర్మాణానికి ఎంపిపి చింతల బుల్లిలక్ష్మి, జెడ్‌పిటిసి కర్రి సత్యం బుధవారం భూమిపూజ చేశారు. సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఉప సర్పంచ్ పందూరి సరువు నాయుడు, పంచాయతీ వార్డు సభ్యులు , గ్రామపెద్దలు, పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తలకు రాంకీ పరామర్శ

ప్రజాశక్తి- అనకాపల్లి: అనకాపల్లి పట్టణం లక్ష్మీదేవిపేట జనసైనికుడు కాండ్రేగుల శంకర్, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బవులువాడ పంచాయతీ దర్జీ కాలనీ జనసేన కార్యకర్త బల్లంకి మోహన్ కృష్ణ, అనకాపల్లి మండలం టిడిపి నాయకులు బత్తుల రమేష్ కుమారుడు బత్తుల హేమంత్‌లను బుధవారం వారి నివాసాలకు వెళ్లి అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ పరామర్శించారు.ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని ఆరిపాక పంచాయతీ శివారు లగిశెట్టిపాలెం గ్రామంలో పైడితల్లమ్మ అమ్మవారి ఆలయం పున:నిర్మాణానికి బుధవారం గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి పెందుర్తి నియోజకవర్గం నాయకులు గండి రవికుమార్, ఆరిపాక సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, స్థానిక వైసిపి నాయకులు బి.మహాలక్ష్మినాయుడు, ఎస్‌పి రాజు, బండారు రమణ, సర్పంచ్‌లు రామారావు, నేబర్తి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు యల్ల నాయుడు , ఐడిబాబు, వాసు పాల్గొన్నారు.

రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా జరిగింది. మున్సిపాలిటీకి గత తొమ్మిది నెలల కాలంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రూ.21కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి అబివృద్ధి చేస్తున్నామని 26వ వార్డు కౌన్సిలర్, స్పీకర్ అయ్యన్న సతీమణి పద్మావతి మున్సిపల్ సమావేశంలో వెల్లడించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు వియంఆర్డిఏ నుంచి కేవలం నాలుగున్నర కోట్లు మాత్రమే తీసుకొచ్చారని మిగతా నిధులు 15వ ఆర్థిక సంఘానికి సంబంధించినవని మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ అన్నారు. దీంతో మున్సిపల్ సమావేశంలో టిడిపి, వైసిపి కౌన్సిలర్లు మధ్య నిధులు మంజూరుకు సంబంధించి వాగ్వివాదం జరిగింది. వైసిపి నాయకులు మున్సిపల్ నిధులు దోచుకున్నారని పద్మావతి వ్యాఖ్యానించారు. గత తొమ్మిది నెలల కాలంలో మీరు దోచుకున్నది చెప్పమంటారా అంటూ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ అన్నారు.అదే విధంగా వైసీపీ కౌన్సిలర్ సిరసపల్లి నాని, జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, టిడిపి కౌన్సిలర్ శ్రీకాంత్ బెల్ట్ షాపులు, ట్రాఫిక్ సమస్యలను ప్రస్తావించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ రోడ్డుపై కారులు, బస్సుల కన్నా రాయి లోడుతో వెళుతున్న లారీలే అధికంగా తిరుగుతున్నాయని జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య అన్నారు. నిర్దిష్ట సమయం పాటించకుండా లారీలు నడుపుతున్నా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. టిడిపి కౌన్సిలర్ శ్రీకాంత్ మాట్లాడుతూ స్కూల్ బస్సులు కారణంగా వీర్రాజు థియేటర్ రోడ్డు, బంగార్రాజు థియేటర్ రోడ్డు ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించిపోతుందని, దీంతో ఆర్టిసి కాంప్లెక్స్ నుంచి సిఎంఆర్ వరకు ప్రధాన రహదారి వాహనాలతో కిక్కిరిసిపోతుందని, ఈ మార్గంలో ట్రాఫిక్ నియంత్రించాలని పోలీసులను కోరారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో గుర్రాల రోడ్డు, శివారు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్నారని, ఈ ప్రాంతాల్లో ప్రజలు భయపడుతున్నారని శ్రీకాంత్ సమావేశంలో ప్రస్తావించారు. నర్సీపట్నం టౌన్ ఎస్ఐ ఉమా మహేశ్వర రావు సమాధానం ఇస్తూ బహిరంగ మద్యం సేవించే ప్రాంతాలపై నిఘా పెట్టామని దాడులు జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలోమున్సిపల్ కమిషనర్ సురేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ప్రశ్నిస్తున్న కౌన్సిలర్


తాతారావును సత్కరిస్తున్న నాయకులు

డిసిసిబి చైర్మన్ తాతారావుకు సత్కారం

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం డిసిసిబి చైర్మన్‌గా నియమితులైన కోన తాతారావును జనసేన పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. తాతారావును పార్టీ కార్యాలయం ఆహ్వానించి, అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా సెక్రెటరీ ఆకేటి గోవిందరావు, సంయుక్త కార్యదర్శి కురందాసు అప్పలరాజు, నాయకులు పాము గణేష్, ఎలమంచిలి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న కో ఆర్డినేటర్

గ్రామాభివృద్ధిపై అవగాహన

ప్రజాశక్తి-కొత్తకోట:సమాచార సేకరణతోనే గ్రామాభివృద్ధికి అవకాశం కలుగుతోందని కొండెం పూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజకుమార్, టిఓ టి. కిషోర్ కుమార్ తదితరులు అన్నారు. బుధవారం రావికమతం మండలం మత్స్యవానిపాలెం గ్రామంలో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన వ్యవసాయ కళాశాల విద్యార్థులతో అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ అభివృద్ధి - సమాచార సేకరణ అంశాలపై విద్యార్థులకు వివరిం చారు.1962 - 2024 ఏళ్ల మధ్య గ్రామంలో ఏ విధమైన అభివృద్ధి జరిగింది అనేది గ్రామ ముఖ చిత్రం తో పాటు గ్రామ పఠం ద్వారా విద్యార్థులకు అవగా హన కల్పించారు.. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు రచన, చెరిష్మా, మణిదీపిక, మేఘన, బిందుమాధవి, అంకిత పాల్గొన్నారు.

సూర్యనారాయణరాజుకు అభినందనలు

పజాశక్తి- కోటవురట్ల: కాకినాడ వైసీపీ పార్లమెంట్ పరిశీలకునిగా మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజును ఎంపిక చేయడం పట్ల మండల వ్యాప్తంగా పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డివి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ, పార్టీ నామీద ఉంచిన నమ్మకాన్ని శక్తి వంచన లేకుండా పార్టీ అభివృద్ధికి పని చేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండ కడతానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.


నిందితుడితో పోలీసులు

గంజాయి నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేంపాడు జంక్షన్ వద్ద బుధవారం గంజాయి నిందితుడును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. 180 కిలోల గంజాయి స్వాధీనం కేసులో 6 గురు నిందితులకు గాను, అప్పట్లో 5 గురు ను అరెస్ట్ చేసామని, మిగిలిన వ్యక్తి తప్పించుకొని తిరుగుతున్నాడన్నారు. బుధవారం వేంపాడు జంక్షన్ వద్ద తప్పించుకుని తిరుగుతున్న రావికమతం మండలం గొల్లలపాలెం గ్రామానికి చెందిన నిందితుడు ఎం నూకరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలోని ఇంటిపాలెం గ్రామంలో బుధవారం ఆలయంలో అభినేంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ట చేశారు. ముఖ్య అతిథులుగా మాడుగుల నియోజకవర్గం శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు కురచ జయమ్మ, వైసీపీ మండల పార్టీ కన్వీనర్ గొల్లవెల్లి రాజబాబు, దేవరపల్లి మండల పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు, పాల సంఘం అధ్యక్షులు ధర్మ శెట్టి కొండబాబు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయండి

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలో ప్రతి మారుమూల గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి కె ఎం నాయుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కొంకి అప్పారావు అధ్యక్షతన సచివాలయ సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పి 4 సర్వేలో భాగంగా మారుమూల గ్రామంలో ఉన్న అట్టడుగు వర్గాల వారికి న్యాయం సమకూర్చే విధంగా పనిచేయాలన్నారు. రక్షిత మంచినీటి ట్యాంకులను పరిశుభ్రంగా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు. సూర్య ఘర్ రిజిస్ట్రేషన్లపై సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపరెడ్డి వెంకట రాజారామ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి నాయుడు

శత శాతం పింఛన్ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మే 1వ తేదీన పింఛన్ పంపిణీ శత శాతం పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి పి ప్రసాద్ అన్నారు. ఎంపీడీవో డి.సీతారామరాజుతో కలిసి బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు పంచాయతీ కార్యదర్శులు సచివాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవినీతికి తావు లేకుండా, పింఛన్ దారులతో గౌరవంగా, మర్యాదగా మెలిగి పింఛన్ నగదు అందజేయాలని సూచించారు. ఉదయం 6 గంటల నుండే పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు.


మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి ప్రసాద్



ఆకట్టుకున్న మే డే కళారూపం

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి తన సూక్ష్మ కళతో కార్మికులకు శుభాకాంక్షలు తెలిపాడు. మే 1వ తేదీన కార్మికుల దినోత్సవం సందర్భంగా చెక్కతో కార్మిక చిహ్నాలు చెక్కి తన సూక్ష్మ కళను ప్రదర్శించాడు. ప్రభుత్వం కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరాడు.



ప్రారంభిస్తున్న బ్రాంచి మేనేజర్

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి -రావిక మతం:మండల కేంద్రంలో డిసిసిబి ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని బ్రాంచ్ మేనేజర్ దుర్గాప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ, ఎండాకాలం దృష్ట్యా డిసిసిబి బ్రాంచ్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బ్రాంచ్ కు వచ్చే వినియోగదారులు, పాదాచారులకు ఈ చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సూపర్వైజర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వితంతువులకు పింఛను మంజూరు చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:వితంతువులకు పింఛన్ మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీవో డి సీతారామరాజుకు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం 01-12-2023 నుండి 31-10-2024 సంవత్సరం మధ్యకాలంలో మృతి చెందిన భర్తల భార్యకు మాత్రమే పింఛన్ మంజూరు చేయాలని మార్గదర్శకాలు ఇవ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వితంతు పింఛన్ మంజూరు చేయడానికి కాల పరిమితి ఏమిటని ప్రశ్నించారు. భర్తను కోల్పోయిన భార్యను ప్రభుత్వం ఆదుకోవాల్సింది పోయి, నిబంధనలు పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. వితంతు పింఛన్ మంజూరు విషయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను వెనక్కి తీసుకొని, వితంతువుల అందరికీ మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు 50 సంవత్సరాలు నిండిన బీసీలకు పింఛన్ మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, బేత నరేష్, చల్లపల్లి రామలక్ష్మి పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నేత అప్పలరాజు

తల్లీకూతుళ్లకు పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి -కొత్తకోట: ప్రెస్‌క్లబ్ వెల్ఫేర్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ అవార్డుల మహోత్సవంలో భాగంగా రావికమతం మండలం కొత్తకోటకు చెందిన పివిఎం నాగజ్యోతి, ఈమె కుమార్తె కలగర్ల సాహితి (తల్లి-కుమార్తె) లకు ఇంటర్నేషనల్ గౌరవం లభించింది. బుధవారం విశాఖపట్నంలో పబ్లిక్ లైబ్రరీ వేదికగా ఇద్దర్ని ఘనంగా సన్మానించారు. ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తకోట కు చెందిన ఉపాధ్యాయురాలు పీ.వీ.ఎం. నాగజ్యోతి, ఆమె కుమార్తె కలగర్ల సాహితి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్నారు. నాగజ్యోతి కు "ఇంటర్నేషనల్ బెస్ట్ ఎచీవర్ అవార్డును ప్రదానం చేశారు. కలగర్ల సాహితి 'భారత్ సమ్మాన్ అవార్డును అందుకున్నారు. తల్లి కుమార్తె లు పలు అవార్డు లు అందుకోవడం పై కొత్తకోట, రోలుగుంట గ్రామాల ఉపాధ్యాయులు, కుటుంం సభ్యులు అభినందనలు తెలిపారు.



షర్మిలను హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గం

కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా ఒబిసి చైర్మన్ రమణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పిసిసి అధ్యక్షురాలు షర్మిల రెడ్డిని హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గమని కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా ఓబిసి చైర్మన్ బొంతు రమణ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అమరావతి క్యాపిటల్ కమిటీ ప్రకటించి రెండు రోజులే అవుతుందన్నారు. ఇంకా పార్టీ భవిష్యత్ కార్యాచరణ ప్రకటించకుండానే కూటమి ప్రభుత్వం భయపడుతుందని, అలాగే ప్రధానమంత్రి మోడీ అమరావతి పర్యటన నేపథ్యంలో మన రాజధాని కోసం ఏం అడగాలి అనే విధివిధానాలు కోసం పార్టీ కార్యాలయానికి వెళ్తుంటే పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డిని ఎందుకు పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్టు చేశారని ప్రశ్నించారు. అమరావతికి ఏమి కావాలో కూటమి ప్రభుత్వం తరపున నరేంద్ర మోడీని అడగాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న నరసిహారావు

కెజిబివి జూనియర్ కాలేజీ అదనపు తరగతుల భవనాలకు నిధుల మంజూరు

ప్రజాశక్తి-రోలుగుంట: చోడవరం నియోజకవర్గం పరిధిలోని మూడు మండలాల్లో గల కేజీబీవీ జూనియర్ కళాశాలల అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.4.71కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందని సర్వశిక్ష అభియాన్ ఇఇ డివి.నరసింహారావు తెలిపారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ చోడవరం నియోజకవర్గ పరిధిలోని రోలుగుంట, రావికమతం మండలం గర్నికం, బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలోని కేజీబీవీ జూనియర్ కళాశాలకు అదనపు తరగతి గదులకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రోలుగుంట కేజీబీవీకి రూ.1.64 కోట్లు, రావికమతం మండలం గర్నికంకు రూ.1.43లక్షలు, వడ్డాది కేజీబీవీకి రూ.1.64లక్షలు మంజూరు చేయడంతో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు ఇప్పటికే శంకుస్థాపన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ సుబ్బలక్ష్మి, ఎఇలు సత్యనారాయణ, మూర్తిలు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లీష్, కథలపై అవగాహన

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని చిన దొడ్డిగల్లు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ అధికారి జనార్ధన్ బుధవారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ పై అవగాహన కల్పించారు. విద్యార్థులు సులభమైన రీతిలో ఆంగ్లంలో మాట్లాడే విధానం గూర్చి వివరించారు. విద్యార్థులతో చదివించారు. పలువురు విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొత్తకోట: కొత్తకోట శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విదార్వర్డుల చే పుస్తక పఠనం తో పాటు పలు పుస్తకాలపై అవగాహన కల్పించామని శాఖ గ్రంథాలయధికారి వరాహ మణి తెలిపారు. ఆసక్తి కరమైన కథలు, కథనాలు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 15మంది విద్యార్థులు పాల్గొన్నారు.

చీడికాడ: శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు లైబ్రరీ ఎన్ఎస్ఎల్ జోగేశ్వరి స్వతంత్ర సమరయోధుల నాయకుల కథలు వినిపించారు. విద్యార్థులకు గట్టు చెరువు కబడ్డీ ఆటలు నిర్వహించారు.

కోటవురట్ల: విద్యార్థులు అన్ని విషయాలలోనూ క్రమశిక్షణను అలవర్చుకోవాలని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిబిరంలో ఉపాధ్యాయులు నరసింగరావు అన్నారు. చిన్నతనం నుండే అన్ని విషయాల పట్ల శ్రద్ధ క్రమశిక్షణ, అంకితభావంతో ముందుకు సాగాలని సూచించారు. గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు, ప్రసాద్ మాస్టారు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్పోర్ట్స్ అధారిటీ ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ప్రారంభిస్తున్నట్లు శాప్ కోచ్ అబ్బు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో ఉషు, బాక్సింగ్, తైకోండో కరాటే, యోగా, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్‌లలో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. 8 నుండి 14 సంవత్సరాల వయస్సు గల వారికి ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. వివరాల కోసం 9332777778 నెంబరుకు సంప్రదించాలన్నారు.

సింహాచలం ఘటనపై స్పీకర్ అయ్యన్న దిగ్భ్రాంతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: సింహాచలం దేవస్థానంలో వద్ద గోడ కూలిన దుర్ఘటనపై స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోడకూలి ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం, మరి కొంతమందికి గాయాలు అవ్వడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు. గాయపడిన వారికీ తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.



మూఢ నమ్మకాలను విడనాడాలి

ప్రజాశక్తి -అనంతగిరి: గిరిజనులు మూఢనమ్మకాలు, గంజాయి రవాణా వంటి వాటికి దూరంగా ఉండాలని అరకు సీఐ హిమగిరి, స్థానిక ఎస్సై శ్రీనివాస్ సూచించారు. బుధవారం కాశీపట్నంలో జరిగిన వారపు సంతలో వివిధ మారుమూల గ్రామాల నుండి వచ్చిన ప్రజల కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మారుమూల గ్రామాలలో ఉన్న గిరిజనులు మూఢనమ్మకాలతో ప్రాణాలను కోల్పోతున్నారని తెలిపారు.





ప్రతి అక్షరం ప్రజల పక్షం

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

మేడే ప్రత్యేక అనుబంధం

Advt feature



MAY 1st
INTERNATIONAL
LABOUR DAY

విశాఖపట్నం, అనకాపల్లి | గురువారం 01-05-2025 | 12 పేజీలు

నిష్కలంక ప్రజాసేవకుడు కామ్రేడ్ సుందరయ్య

పుచ్చలపల్లి సుందరయ్య బాగా కలవారింట పుట్టారు. గొప్ప నాయకునికి ఉండాల్సిన త్యాగశీలత, నిరాడంబరత్వం, తాను నమ్మిన విషయాలను నిష్టగా భల్లూకపట్టుతో అనుసరించడం ఆయనకు చిన్ననాడే అలవడ్డాయి. ఏది చేసినా నిష్టగా, తపస్వీవ్రతంగా చేయడం ఆయనకు అలవాటైపోయింది. ఈ గుణం పధ్నాలుగో ఏటనే రాజకీయాల్లో ప్రవేశించి, 'సోదర సమితి'ని స్థాపించినప్పుడు పొటమరించి, అన్నవరం ఆశ్రమంలో చిగురించి, సైమన్ కమిషన్ వ్యతిరేక

నేడు ఆ మహనీయుని జయంతి

ప్రదర్శనలో విరిసి, బోర్‌స్టల్ స్కూలు శిక్ష అనుభవంతో మరింత విస్తరించి ఆయనను ఒక మహానాయకునిగా తీర్చిదిద్దింది.

సుందరయ్య నెల్లూరు జిల్లా అలగానిపాడులో 1913 మే 1వ తేదీన ఓ ధనిక రైతు కుటుంబంలో జన్మించారు. బాల్యంలోనే వివేకానంద, రామతీర్థుల బోధనలను ఆకళింపు చేసుకున్నారు. గాంధీజీ దేశసేవా దీక్షతో ఉత్తేజితులయ్యారు. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, కొమర్రాజు లక్ష్మణరావు వంటి ఆంధ్ర మహాపురుషుల సాహితీ వికాసంతోనూ, సాంఘిక చైతన్యంతోనూ ఆంధ్రాభిమానాన్ని పెంపొందించుకున్నారు. తన 14వ ఏటనే మద్రాసులో అఖిల భారత కాంగ్రెస్ మహాసభను సందర్శించారు. సైమన్ కమిషన్‌ను బహిష్కరిస్తూ జరిగిన హర్తాళ్‌లోనూ, ప్రదర్శనలోనూ పాల్గొన్నారు. 1930లో మద్రాసు లయోలా కళాశాలలో ఇంటర్ చదువుతూ తోటి విద్యార్థులతో కలిసి 'సోదర సమితి' స్థాపించారు. దేశాభిమానాన్ని పెంపొందించడం, రాజకీయాలను అవగాహన చేసుకోవడం, ఆదివారాల్లో ఖద్దరు అమ్మడం, కసరత్తు చేయడం, సాంఘిక దురాచారాలను రూపుమాపడం, సెలవు రోజుల్లో తమ గ్రామాల్లోని రైతు కూలీలను విజ్ఞానవంతులుగా చేయడానికి కృషి, సేవ చేయడం 'సోదర సమితి' లక్ష్యాలు. సుందరయ్య ఓ వేమన జయంతినాడు గ్రామంలో సవర్ణ హిందువులకూ, దళితులకూ కలిపి భోజనం ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని ధనిక రైతులూ, సనాతనులూ దీన్ని వ్యతిరేకిస్తూ దౌర్జన్యానికి తలపడ్డారు. గాంధీ పంథాపై విశ్వాసమున్న సుందరయ్య ఆనాడు వారి హృదయాల్లో పరివర్తన తీసుకొచ్చేందుకు రెండురోజులపాటు నిరశన దీక్ష చేశారు.

1930 ఏప్రిల్‌లో గాంధీజీ పిలుపునందుకొని పూర్తిగా స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనాలనే సంకల్పంతో కళాశాల చదువుకు స్వస్తి చెప్పదలిచారు. తల్లికీ, అన్నకూ కాలేజీ వదిలిపెడుతున్నానని ఉత్తరం రాసి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఉన్న సత్యాగ్రహ శిబిరంలో చేరారు. అక్కడాయన.. తన నిరంతర కృషికి నిరాడంబరమైన, నిర్మాణాత్మకమైన జీవితానికి అందరి అభిమానాన్ని చూరగొన్నారు. తరువాత ఆయన అక్కడుండగానే ప్రభుత్వం అరెస్టు చేసి రెండేళ్ల శిక్ష విధించింది. బాలుడవడంతో ఆయనను తంజావూరులోని బోర్‌స్టల్ స్కూలుకు పంపించారు. అక్కడ రాజకీయ ఖైదీలనుభవిస్తున్న దుర్భర పరిస్థితులకు అసమ్మతిగా జరిగిన ఆందోళనకు నాయకత్వం వహించి రెండుసార్లు నిరసన వ్రతాలను నిర్వహించారు.

1933లో హరిజనోద్యమ సందర్భంగా గాంధీజీ ఆంధ్రదేశ సంచారం చేసినప్పుడు కాంగ్రెస్ వలంటీర్ సంస్థకు ఉపఅధికారిగా పనిచేశారు. శాసనోల్లంఘనోద్యమం విఫలం కావడంతో ఆయన అనేకమంది యువకులతోపాటు దేశ స్వాతంత్ర్య సాధనకు ఇతర మార్గాల గురించి ఆలోచించసాగారు. బలప్రయోగంతో మాత్రమే బ్రిటీషు వారిని పారదోలగలమనే ఆలోచనలోకి వచ్చి టెర్రరిస్టులతో సంబంధాలను పెట్టుకోవడం ప్రారంభించారు. అయితే బెంగుళూరులో ఉన్నప్పుడు మార్క్సిస్టు సాహిత్యాన్నీ, రష్యా విప్లవానికి సంబంధించిన పుస్తకాలనూ అధ్యయనం చేశారు. ఈ పరిస్థితుల్లో ఆయనకు దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీని నెలకొల్పడానికి ఉత్తరాది నుంచి పంపబడిన అమీర్ హైదర్‌ఖాన్‌తో సంబంధం ఏర్పడింది. దానితో సుందరయ్య తన తోటి సహచరులకూ, కాంగ్రెస్‌లోని విప్లవ భావాలుగల యువకులకూ టెర్రరిస్టు ఉద్యమంతో ఉపయోగం లేదని వివరించి వారినందరినీ కమ్యూనిస్టు పార్టీవైపు తిప్పడం ప్రారంభించారు.

1934లో ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. పార్టీని నిర్మిస్తూనే ఆయన కాంగ్రెస్ కార్యకలాపాల్లో కూడా చురుగ్గా పాల్గొనేవారు. అదే సంవత్సరం పిసిసి సభ్యుడుగానూ, ఎఐసిసి సభ్యుడుగానూ ఎన్నుకోబడ్డారు. ఆ తర్వాత కాంగ్రెస్ సోషలిస్టు పార్టీకి చాలాకాలంపాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఒక్క ఆంధ్రలోనేగాక తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కూడా కమ్యూనిస్టు పార్టీని స్థాపించే బాధ్యత సుందరయ్యకు అప్పగించారు. కేరళలో ఆనాడు కాంగ్రెస్‌లో అతివాదులుగా పనిచేస్తున్న కృష్ణపిళ్లై, నంబూద్రిపాద్ మొదలగువారితోనూ, తమిళనాడులో పి.రామమూర్తి ప్రభృతులతోనూ సంబంధాలు పెట్టుకొని వారిని కమ్యూనిస్టు పార్టీ వైపునకు ఆకర్షించేటట్టు చేయగలిగారు. వారి సహాయంతో ఆయా రాష్ట్రాల్లో కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు.

తల్లిదండ్రుల ఆస్తి నుంచి తన వాటాకు వచ్చిన యావదాస్తినీ సుందరయ్య అమ్మేసి ప్రజా ఉద్యమ నిర్మాణానికి ఆ డబ్బులను ఖర్చు పెట్టి ఆంధ్రదేశంలో మహోన్నతమైన త్యాగ సంప్రదాయాన్ని నెలకొల్పారు. సొంత ఆస్తి అంటూ ఏమీ లేకుండా, విప్లవ ప్రజా ఉద్యమానికి సంపూర్ణంగా తన జీవితాన్ని అంకితం చేశారు.



తెలంగాణా ప్రాంతంలో పనిచేస్తున్న ఆంధ్ర మహాసభ నాయకులతో అంతకుముందేగల సంబంధాలను మరింత దృఢపరుచుకొని, అక్కడ నైజాం పరిపాలనకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటానికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించిన వారిలో సుందరయ్య ఒకరు. యావదాంధ్రదేశం ఒకే ప్రభుత్వం కింద ఉండాల్సిన ఆవశ్యకతను ప్రబోధించుతూ, మొట్టమొదటి సారిగా కమ్యూనిస్టు పార్టీ తరపున 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అనే పుస్తకాన్ని తెలుగులోనూ, ఆంగ్లంలోనూ ప్రచురించి విశాలాంధ్ర నినాదాన్ని ఆంధ్ర ప్రజల్లోనేగాక యావద్భారతంలోనూ ప్రచారం కావడానికి తోడ్పడ్డారు. ఆ గ్రంథమే ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి పునాది వేసిందంటే అతిశయోక్తి కాదని 'ఆంధ్రపత్రిక' తెలుగు వెలుగు శీర్షికన సుందరయ్య గురించి ప్రస్తావించింది.

తెలంగాణా ప్రాంతంలో ఆంధ్ర మహాసభ నాయకత్వాన నైజాం నవాబుకు, నిరంకుశ, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగానూ తిరుగుబాటు ప్రారంభమైంది. అదే సందర్భంలో కోస్తా ఆంధ్రప్రాంతంలో కూడా పీడిత ప్రజలు తమ హక్కులకై ప్రత్యక్ష పోరాటాలకు నానాటికీ తయారవుతున్నారు. ఈ పరిస్థితుల్లో మద్రాసులో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ఆర్డినెన్సు జారీ చేసి కమ్యూనిస్టులను పట్టుకొని డిటెయిన్ చేయడం ప్రారంభించింది. దానితో సుందరయ్య అజ్ఞాతవాసంలోకి వెళ్లాల్సి వచ్చింది. ఈ కాలంలో ఆయన చారిత్రాత్మక వీర తెలంగాణా సాయుధ విప్లవ పోరాటానికి నేతృత్వం వహించారు. 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి జరిగిన మొదటి సాధారణ ఎన్నికల్లో ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీ పెద్ద పార్టీగా ఎన్నికైంది. అయితే మద్రాసు రాష్ట్ర పరిధిలోని తమిళ ప్రాంతంలోనూ, మరట్వాడా, కర్నాటక ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు హెచ్చుగా స్థానాలు రావడంతో కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. రహస్యంగా ఉండగానే సుందరయ్య రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1952లో ఉభయ సభల్లో కాంగ్రెస్ తరువాత కమ్యూనిస్టు పార్టీకే హెచ్చు సీట్లు రావడంతో దానికి ప్రధాన ప్రతిపక్ష హోదా లభించింది. కమ్యూనిస్టు పార్టీ పక్షాన సుందరయ్య పార్లమెంటరీ పార్టీ నాయకుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్లమెంట్‌లో వచ్చే ప్రతి సమస్యపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి, అన్ని చర్చల్లోనూ సుందరయ్య పాల్గొనేవారు. పార్లమెంటరీ వ్యవహారాలనేగాక, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడుగా ఆయన కేంద్రంలో ఇతర బాధ్యతలు కూడా చూసేవారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడుగా సుందరయ్య తన నిరంతర కృషి ద్వారా నిర్మాణాత్మకమైన సూచనల ద్వారా నిశితమైన విమర్శల ద్వారా అందరి అభిమానాన్నీ గౌరవాన్నీ చూరగొన్నారు.

1955లో ఆంధ్రరాష్ట్రంలో కాంగ్రెస్ మంత్రివర్గం పడిపోయి మధ్యంతర ఎన్నికలు జరిగినప్పుడు సుందరయ్య గన్నవరం నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎన్నికయ్యారు. దానితో ఆయన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా ఇచ్చి తిరిగి ఆంధ్ర రాజకీయాల్లో ప్రధానంగా పనిచేయనారంభించారు. ఆంధ్ర రాష్ట్ర శాసనసభలోనూ, తర్వాత ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలోనూ సుందరయ్య ప్రతిపక్ష నాయకుడుగా ఉండి ఆ స్థానానికి ఒక విశిష్టతను చేకూర్చారు. అంతకుముందు ఎప్పుడూ పాలక వర్గ పార్టీ ముఖ్యునికే ఇవ్వబడే పబ్లిక్ అకౌంట్ కమిటీ (పిఎసి) అధ్యక్ష పదవిని మొట్టమొదటసారిగా ప్రతిపక్ష నాయకుడికి ఇచ్చి ఆంధ్ర శాసనసభ సుందరయ్యను గౌరవించింది.

విప్లవోద్యమం, పార్టీ నిర్మాణ కార్యక్రమం, పార్టీ-ప్రజాసంఘాల కార్యకలాపాలు, పార్లమెంటరీ రంగం ఏదైనా కానీయండి దేనిలోనైనా సంపూర్ణంగా లీనమై కృషి చేయడం.. ఇతరులకంటే మిన్నగా ఆదర్శప్రాయంగా పనిచేయడం సుందరయ్యలోని ప్రత్యేకత. ఆయన పరిశ్రమశీలత వల్ల ఏ విషయమైనా వివిధ దృక్పథాలతో క్షుణ్ణంగా చదివి, ఆకళింపు చేసుకొని ప్రతివాదులతో పోరుకు ఆయన తలపడేవారు. ఒకసారి పార్లమెంట్‌లో క్రిమినల్ లా సవరణ బిల్లు చర్చకు వచ్చింది. న్యాయ శాస్త్రానికి సంబంధించి క్లిష్టమైన క్లాజులతో నిండి ఉండే ఇలాంటి బిల్లుపై చర్చలో న్యాయవాద సభ్యులు మాత్రమే మామూలుగా పాల్గొనడం కద్దు. అలాంటిది సుందరయ్య ఒక రాత్రంతా కూర్చొని బిల్లును సమగ్రంగా అధ్యయనం చేసి అవగాహన చేసుకొని బిల్లుకు ప్రతిపాదించవలసిన సవరణలను తయారు చేసుకొని మరుసటి రోజు చర్చల్లో న్యాయవాద సభ్యులకంటే బాగా మాట్లాడగలిగారు. ఆయన పరిశ్రమకూ, దీక్షకూ తోటి సభ్యులు ఆశ్చర్యపోయారు. ఓ మారెవరో 'నీకు రాజకీయాలంటే తెలుసునేమో గానీ ఆంధ్ర సాహిత్యం సంగతి ఏమి తెలుసు?' అని అధిక్షేపించారట. ఆనాటికుండే ఆయన నన్నయ మొదలు నేటి ఆధునిక కవులు దాకా రాసిన ప్రధాన గ్రంథాలను (మిగతా లోపలి పేజీలో)

ప్రతి అక్షరం ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
మేడే ప్రత్యేక అనుబంధం
విశాఖపట్నం, అనకాపల్లి | గురువారం 01-05-2025 | 12 పేజీలు

కార్మిక విజయ గీతిక మేడే

ప్రజాశక్తి - విశాఖపట్నం

మేడే.. కార్మికుల విజయ గీతిక. ఓ మహత్తర పోరాటం ప్రపంచంలో పురుడుపోసుకున్న రోజు. ఎనిమిది గంటల పనిదినం కోసం కార్మికులు రక్తం చిందించిన రోజు. శ్రమజీవుల జయకేతనం సమున్నతంగా ఎగిరిందీ రోజు. అప్పటి సామ్రాజ్యవాదం మీద కార్మికవర్గం పోరాడి సాధించిన విజయానికి తీపిగురుతు ఈ రోజు. అమెరికా సామ్రాజ్యవాదానికి, జార్జి చక్రవర్తి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి హక్కులు సాధించిన అమరవీరులకు లాల్‌సలాం అంటూ ప్రపంచ వ్యాప్తంగా మేడేను కార్మికలోకం ఘనంగా జరుపుకోవడం రివాజు. ఈ నేపథ్యంలో మేడే విశిష్టతను, మన ముందున్న కర్తవ్యాలను తెలుసుకుందాం.



కనీస హక్కులు, ఎనిమిది గంటల పనిదినం, సమానపనికి సమాన వేతనం కోసం కార్మికవర్గం పోరాడి విజయం సాధించిన మధుర గురుతు మేడే. అటువంటి విజయానికి ప్రస్తుత పాలకులు తూట్లు పొడుస్తున్నారు. పని దినాన్ని 8 నుంచి 12 గంటలకు మార్చడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. చట్టాలను కుదించి నాలుగు కోడ్స్‌గా విభజించి అమలుకు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త హక్కులను సాధించుకోవడం మాటెలా ఉన్నా ఉన్న హక్కులను కాపాడుకోవాలంటే కార్మికలోకం సంఘటితంగా పోరాడాలి. సరైన వేతనం కోసం, సాంఘిక సంక్షేమ కోసం, కార్మిక హక్కుల పరిరక్షణ, (మిగతా లోపలి పేజీలో..)

- **నేడు వాడవాడలా వేడుకలు, జెండా ఆవిష్కరణలు**
- **వారం రోజులపాటు సంబరాలు**

మేడే స్ఫూర్తితో...

కార్మిక హక్కుల రక్షణకు ఉధృత పోరాటాలు



2025 మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణ కోసం ఉధృతమైన పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక వర్గం హక్కులను కాలరాసేందుకు ప్రయత్నం చేస్తోంది. దానికనుగుణంగానే ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోంది. విమానాశ్రయాలు, పోర్టులు, చమురు సంస్థలు, బ్యాంకులు ఇన్స్యూరెన్స్ కంపెనీలు, విద్యుత్తు, రవాణా, చివరకు దేశ రక్షణను కూడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోంది. 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను స్టాటజిక్ సేల్ పేరుతో ప్రయివేటు వారికి ఇవ్వడానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తోంది. ఇలా దేశ ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలుగా ఉన్న ప్రభుత్వ రంగాన్ని మొత్తం నాశనం చేస్తోంది. దేశభక్తి పేరుతో దేశ సంపదను కార్పొరేట్ల పరం చేస్తోంది. ఈ ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాడవలసిన అవసరం ఎంతైనా ఉంది.

మరో ప్రక్క బ్రిటిష్ కాలం నాడే పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నేడు నిర్వీర్యం చేస్తున్నారు. 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా తీసుకువచ్చారు. ఈ లేబర్ కోడ్స్ అమలైతే కార్మికులు కట్టు బానిసలుగా మారతారు. ప్రస్తుతం ఉన్న చట్టాల వల్ల కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ, సామాజిక భద్రత, సెలవులు తదితరాలు పొందగలుగుతున్నారు. ఈ లేబర్ కోడ్స్ అమలైతే ఇంతవరకు కార్మికులకు ఉన్న హక్కులన్నీ పూర్తిగా యాజమానులకు అనుకూలంగా మారుతాయి. యాజమాన్యం యొక్క దయాదాక్షిణ్యాలపై కార్మికుల బతకాల్సిన పరిస్థితికి నెట్టబడతారు. అందుకే ఈ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని మే 20వ తేదీన దేశవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన అఖిల భారత సమ్మె జరుగుతుంది. ఈ సమ్మెలో కార్మిక వర్గం యావత్తు పాల్గొనాలి.

మోడీ ప్రభుత్వం కార్మిక వర్గం మధ్య చిచ్చు పెట్టేందుకు మతాన్ని వాడు కుంటుంది. కులం, మతం, ప్రాంతం పేరుతో కార్మికుల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేందుకు నిరంతరం కుట్రలు పన్నుతోంది. కార్మిక వర్గం యావత్తు ఈ కుట్రలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉంది.

భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బిజెపి గానీ, దాని అనుబంధ సంస్థ ఆర్ఎస్ఎస్ గానీ ఏ ఒక్కరోజూ పాల్గొనలేదు. కాని నేడు తామే నిజమైన దేశభక్తులమని చెబుతూ భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని సామ్రాజ్యవాద అమెరికా కాళ్ల దగ్గర తాకట్టు పెడుతున్నారు. అమెరికాకు జూనియర్ భాగస్వామిగా ఉంటున్నారు.

మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లకు జీతాలు పెంచుతామని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ నేడు దానికి భిన్నంగా వ్యవహరిస్తూ కార్మిక వర్గం మీద మరిన్ని భారాలను మోపుతున్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ఆదేశాలను తూచ తప్పకుండా రాష్ట్రంలో అమలు చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, ముఠా, ఆటో, తోపుడు బళ్లు, చిరు వ్యాపారస్తులకు సమగ్ర చట్టం చేస్తామని చెప్పినా ఇప్పటి వరకు అటువంటి ప్రయత్నం చేయడంలేదు. అప్కాస్‌ను రద్దు చేసి తిరిగి పాత కాంట్రాక్టు వ్యవస్థను తీసుకొస్తామని ప్రకటించారు. దీని వల్ల రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖలలో పనిచేస్తున్న లక్షలాది మంది ఉద్యోగ భద్రత లేకుండా పోతారు. అప్కాస్‌ను రద్దుచేస్తే ఆ పరిధిలో పనిచేస్తున్న కార్మికులాందరనీ రెగ్యులర్ చేయాలి. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పేరుతో కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారు. సరైన ఉపాధి లేక యువత స్విగ్గి, జొమోటో, అమెజాన్, ఓలా, ఉబెర్, రాపిడో లాంటి గిగ్ వర్కర్స్ అతి తక్కువ వేతనాలతో యాజమాని ఎవరో, ఎక్కడుంటాడో కూడా తెలియని పరిస్థితిలో పనిచేస్తున్నారు. వీరికి ఏ విధమైన హక్కులు, చట్టాలు లేవు. స్వస్థలంలో పనులు దొరక్క పట్టణాలకు ఇతర రాష్ట్రాలక పొట్ట చేత్తో పట్టుకొని పనుల కోసం వలస కార్మికులుగా వెళుతున్నారు. ఈ వలస కార్మికులకు చట్టం ఉన్నా ఎక్కడా దీనిని అమలు చేయడం లేదు. దీనివల్ల కార్మికులు అత్యధిక పని గంటలు పనిచేస్తున్నా అతి తక్కువ వేతనాలు మాత్రమే పొందుతున్నారు. వీరికి సక్రమమైన వసతి, మంచినీరు, వైద్యం వంటివి అందక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. వీరి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

కార్మికులు ఎక్కడ పనిచేసినా ప్రభుత్వ రంగమైనా, ప్రయివేటు రంగమైనా, సంఘటిత, అసంఘటిత రంగమైనా అందరూ ఒక్కటే అనే భావనతో కార్మిక వర్గం మెలగాలి. ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సంఘటితంగా, ఐక్యంగా పోరాడడం ద్వారా కార్మిక హక్కులను కాపాడుకోవచ్చు. మేడే స్ఫూర్తితో మరిన్ని పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని, లేబర్ కోడ్స్ రద్దు కోసం మే 20న జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెలో యావత్ కార్మిక వర్గం భాగస్వాములు కావాలని కోరుతున్నాం.

- ఆర్‌కెఎస్‌వి.కుమార్
సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి

కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపుతో పోరాటం



కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు, ఎన్నో ఏళ్లుగా కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలన్నింటినీ తుంగలో తొక్కి, కార్మికులకు హక్కులు ప్రయోజనాలు లేకుండా చేసే విధంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకువస్తోంది. యజమానుల ప్రయోజనాల కోసం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లు అమలులోకి వస్తే, కార్మిక వర్గానికి ఎటువంటి హక్కులు ఉండవు. ఈ ప్రమాదాన్ని గుర్తించి, యూనియన్లు, రాజకీయాలను, పక్కనపెట్టి అందరూ ఐక్యంగా, సమరశీలంగా పోరాడవలసిన అవసరం ఉంది. నాలుగు కోడ్ల కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాన్ని, జాతీయ కార్మిక సంఘాల సమాఖ్య కూడా తప్పు పట్టింది. కార్మిక హక్కులను, ప్రయోజనాలను హరించే విధంగా ప్రపంచంలో ఏ ప్రభుత్వమూ ఇంత దారుణంగా వ్యవహరించిన దాఖలాలు లేవు.

- ఎన్.కనకారావు,
జాతీయ అధ్యక్షులు,
సిఎఫ్‌టియుఐ

లేబర్ కోడ్ల రద్దుకు తీవ్ర పోరాటం

కార్మిక వర్గాన్ని కట్టు బానిసత్వానికి గురి చేసే లక్ష్యంతో ఆర్ఎస్ఎస్, బిజెపి సర్కార్ తెచ్చే లేబర్ కోడ్ల రద్దుకు పోరాటాన్ని తీవ్రతరం చేద్దాం. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, స్కీం వర్కర్ల క్రమబద్ధీకరణ కోసం ఉద్యమిద్దాం. బేడీలు సరిహద్దులు దాటే గ్లోబల్ శ్రమ, శ్రమ శక్తి కాదు. హద్దులు దాటే గ్లోబల్ పెట్టుబడిని నియంత్రణ చేయాలి. ఇదే, ఈ ఏడాది మేడే పిలుపు.

-జిఎస్‌జె.అచ్యుతరావు
ఎఐటియుసి
విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి





కార్మిక హక్కుల సాధనకు మరిన్ని పోరాటాలు



అనకాపల్లి జిల్లా పారిశ్రామికంగా దూసుకుపోతోంది. జిల్లాలో సంఘటిత, అసంఘటిత రంగంలో మూడు లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారు. నియోజకవర్గానికి ఒక ఎస్ఈజెడ్ పెడతామని, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ ఫార్మా కంపెనీలు, మిట్టల్ స్టీల్ పరిశ్రమ, పోర్టు రానున్నాయని, లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం ఉదరగొడుతుంది. అచ్యుతాపురం, పరవాడ, రాంబిల్లిలో ఫార్మా, ఎస్ఇజెడ్‌ల్లో ఎక్కడా కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. స్థానికులకు ఉద్యోగాలు కల్పించడం లేదు. కాంట్రాక్ట్ కార్మికులను శ్రమ దోపిడీ చేస్తున్నారు. ఎప్పుడు ఏ పరిశ్రమలో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని కార్మికులు ప్రాణాల అరచేతలో పట్టుకొని పనిచేస్తున్నారు. ఏ కంపెనీలోనూ కార్మిక చట్టాలు అమలు కాలవడం లేదు. కనీస వేతనం, 8 గంటల పని అమలు అంతంత మాత్రమే... కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణ చేయకముందే చంద్రబాబు నాయుడు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే 300 మంది కార్మికులలోపు ఉన్న పరిశ్రమలు ప్రభుత్వ అనుమతి లేకుండా మూత వేయవచ్చని ఉత్తర్వులు ఇచ్చారు. ఇటీవల అభిజిత్, రాజరాజేశ్వరి ఫెర్రో ఎల్లాయిస్, క్రేప్స్ ఫార్మా కంపెనీలు 300 మంది కార్మికులు దాటి ఉన్నా కూడా ప్రభుత్వ అనుమతి లేకుండానే లాకౌట్, లే ఆఫ్ ప్రకటించాయి.

కంపెనీల్లో తరచూ ప్రమాదాలతో కార్మికులు మరణిస్తున్నారు. లాభాలే పరమావధిగా ఉన్న పరిశ్రమల యజమానులు సేఫ్టీ నిబంధనలు పాటించకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సేఫ్టీని పర్యవేక్షించాల్సిన అధికారులు కంపెనీలకు వెళ్లకుండా ప్రభుత్వమే ఆంక్షలు విధిస్తుంది. ఏ కంపెనీలో ఎప్పుడు తనిఖీలు చేయాలో ప్రభుత్వమే నిర్ణయం చేస్తుంది. దీనితో పరిశ్రమల్లో భద్రత డొల్లతనంగా మారిపోయింది. పరిశ్రమల యజమానులు తమ లాభాలను పెంచుకోవడం కోసం వలస కార్మికులను ఉత్తరప్రదేశ్, బీహార్, ఒరిస్సా, బెంగాల్ ప్రాంతాల నుండి తీసుకొచ్చారు. వారికి గాలి, వెలుతురు లేని చిన్న గదుల్లో వసతి కల్పించి తక్కువ వేతనంతో బానిసలుగా వారి చేత పని చేయిస్తున్నారు. వారికి ప్రమాదం జరిగితే గుట్టుచప్పుడు కాకుండా వారి స్వగ్రామం తరలిస్తున్నారు. వలస కార్మికుల చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు వీటిని పట్టించుకోవడం లేదు. కొత్త లేబర్ కోడ్స్‌లో వలస కార్మికుల చట్టాన్ని నిర్వీర్యం చేశారు. జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు, ఆటో మోటార్ కార్మికులు, స్కీం వర్కర్లు లక్షలాదిగా ఉన్నా వీరికి ఎటువంటి చట్టాలు అమలు కావడం లేదు. మే డే స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధన కోసం మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలి. మే 20న దేశవ్యాప్తంగా జరుగు సమ్మెలో అనకాపల్లి జిల్లా కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నాం.

- ఆర్.శంకరరావు
సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి



నిష్కలంక ప్రజాసేవకుడు కామ్రేడ్ సుందరయ్య

(కొనసాగింపు)

పుక్కిటబట్టి అర్థం కాని వాటిని పండితుల వద్ద తెలుసుకొని 'ఇక భయంలేదు' అని గుండె మీద చేయివేసుకున్నారట. అందుకు తార్కాణంగా ఆయనవద్ద ఆంధ్ర సాహిత్యానికి సంబంధించిన పెద్ద గ్రంథాలయమే ఉండేది.

భారత కమ్యూనిస్టు పార్టీలో పొడసూపిన రివిజనిస్టులతో తెగతెంపులు చేసుకొని, 1964లో కలకత్తాలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)ని పునర్నిర్మించారు. ఆ మహాసభలోనే సుందరయ్య పార్టీ అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తిరిగి ఆయన దేశవ్యాపితంగా పార్టీని పునర్నిర్మించడంలో నిమగ్నమయ్యారు. 1967 ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో మార్క్సిస్టు పార్టీ నాయకత్వాన ఐక్య సంఘటనా ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కేరళలో ఇంఎంఎస్ నంబూద్రిపాద్ ముఖ్యమంత్రిగా ఉండగా.. పశ్చిమ బెంగాల్‌లో జ్యోతిబసు ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు.

ఆ మంత్రివర్గాలు పనిచేస్తున్న కాలంలోనే పార్టీలో తీవ్రవాద పోకడలు ఉత్పన్నమైనాయి. రష్యా-చైనా మధ్య ఏర్పడిన వివాదాలతో ఈ పోకడలు మరింత ఉధృతం కావడంతో పార్టీలో అతివాద దుందుడుకు పెడధోరణి ప్రమాదమేర్పడింది. ఈ ఆటుపోట్లనుంచీ కూడా పార్టీని నిలబెట్టుకోవాల్సివచ్చింది.

తన జీవిత చరమాంకంలో కేంద్ర బాధ్యతలను వదులుకొని రాష్ట్రంలో పార్టీ బాధ్యతలు స్వీకరించారు. ఆనాటికి రాష్ట్రంలో వందలాది మంది యువకులను నక్సలైట్ల పేర అమానుషంగా కాల్చి చంపించిన జలగం వెంగళరావు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున పౌరహక్కుల ఉద్యమాన్ని నిర్మించారు. పౌరహక్కులతో పాటు ప్రజాతంత్ర హక్కుల సంరక్షణకు దేశ ప్రజల దృష్టి మళ్లించడానికి శాయశక్తులా కృషి చేశారు. భార్గవ కమిషన్ ముందు వెంగళరావు ప్రభుత్వం జరిపించిన అమానుష హత్యలు రుజువు చేయించడానికి ఆయన తీవ్రంగా కృషి చేశారు. ప్రజా సమస్యలపై 1980 ప్రాంతాల్లో అన్ని పార్టీలనూ కూడగట్టి అఖిలపక్ష ఉద్యమాలకు అంకురార్పణ చేశారు. చారిత్రాత్మక సిపిఎం 11వ మహాసభను విజయవాడలో జయప్రదంగా నిర్వహించడానికీ, కృష్ణానదీ గర్భంలో బ్రహ్మాండమైన సభ జరపడానికీ నిర్విరామంగా కృషి చేశారు. విప్లవ ప్రజా నాయకుడు, విరామమెరుగని నిష్కలంక ప్రజాసేవకుడు, ఉత్తమ శ్రేణి దేశభక్తుడైన సుందరయ్య 1985 మే19న కన్నుమూశారు.







విశాఖ అభివృద్ధిలో ప్రభుత్వ రంగానిది కీలక పాత్ర



విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్



హిందూస్థాన్ షిప్‌యార్డు

ఉమ్మడి రాష్ట్రంలోనే రెండవ పెద్ద నగరంగా విశాఖపట్నం ఉంది. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్ర ప్రదేశ్‌లో అతి పెద్ద నగరం ఇదే. స్వాతంత్ర్యానికి పూర్వం ఒక చిన్న మత్స్యకార గ్రామంగా ఉన్న విశాఖ నేడు అతి పెద్ద నగరంగానూ, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న వంద నగరాలలో ఒకటిగానూ ఉండడానికి ప్రధాన కారణం నగరంలో నెలకొన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలే. ఇంకా విశాలంగా చెప్పాలంటే.. ప్రభుత్వ రంగ సంస్థలు దేశాభివృద్ధిలోనూ, దేశ స్వావలంబన సాధించడంలోనూ ప్రముఖ పాత్ర నిర్వహించాయి. అందుకే దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఆధునిక దేవాలయాలని అభివర్ణించారు. కానీ నేటి పాలకులు అటువంటి సంస్థలను ధ్వంసం చేయడమే ఒక విధానంగా పెట్టుకున్నారు.

1901 సంవత్సరంలో 40,892 ఉన్న నగర జనాభా విశాఖ పోర్టు ట్రస్టు ఏర్పడిన తరువాత 1951 కల్లా రెట్టింపుకుపైగా పెరిగింది. హిందూస్థాన్ షిప్‌యార్డ్ స్థాపనతో ఈ పెరుగుదల క్రమం మరింత పుంజుకుంది. 1951-61 మధ్య పదేళ్ళ కాలంలోనే నగర జనాభా రెట్టింపు పెరిగి 2లక్షల 15వేలకు చేరుకుంది. బిహెచ్‌పివి ఏర్పడిన తరువాత 1971 నాటికి 3,68,000కు జనాభా చేరింది. నేవల్ డాక్‌యార్డ్ విస్తరణ, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఏర్పడిన తరువాత 1991 కల్లా జనాభా 13లక్షల 57వేలకు పెరిగింది. ఇదంతా ప్రభుత్వ సంస్థల వల్లనే జరిగింది. ప్రభుత్వ సంస్థలలో మెరుగైన ఉపాధికై అనేక మంది గ్రామీణ ప్రాంతాల నుండి నగరానికి వలసలు వచ్చారు. వీటితో పాటు హెచ్‌పిసిఎల్, బ్యాంకులు, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల వల్ల 2011లో 17.43 లక్షలు, 2021లో 22.26 లక్షల జనాభా ఉంది. నేడు విశాఖ నగర జనాభా సుమారు 25 లక్షలుగా ఉంది. ఈ ప్రభుత్వ సంస్థల నిర్మాణం వల్ల వాటిలో పనిచేసే ఉద్యోగుల గృహవసతి, గృహోపకర వస్తువులు వంటి అవసరాలు తీర్చడానికి సర్వీసు రంగం అభివృద్ధి అయింది. ఈ జనాభా ఆహార అవసరాలకై సమీప గ్రామాలలో కూరగాయల పంటలు పెరిగాయి.

ఇలా పారిశ్రామికీకరణ వలన వ్యవసాయ, సర్వీసు రంగాలు కూడా అభివృద్ధి జరిగి, అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయి.



హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్)

కేవలం జనాభా పెరగడమే కాక, ఇతర అవసరాలకై నగర వైశాల్యం కూడా క్రమంగా పెరుగుతూ వస్తోంది. నేడు 681 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో దేశంలోనే మూడవ పెద్ద నగరంగా నిలిచింది. ఈ పారిశ్రామికీకరణ వలన 3,67,529 కోట్ల రూపాయల స్థూల జాతీయ ఉత్పత్తితో దేశంలో తొమ్మిదవ సంపన్న నగరంగా ఉంది. వార్షిక బడ్జెట్ 4,171 కోట్ల రూపాయలుగా ఉంది.

అయితే 1991 నుండి దేశంలో అమలవుతున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రారంభమైంది. వీటి ప్రభావం విశాఖ నగరంపై కూడా సహజంగానే బలంగా పడింది. మహారత్న కంపెనీగా ఉన్న హిందూస్థాన్ జింక్ పరిశ్రమను పూర్తిగా అమ్మేయడం, తరువాత మూతబడడం జరిగింది. విశాఖపట్నం పోర్టు, షిప్‌యార్డ్, బిహెచ్‌పివి, డాక్‌యార్డ్ వంటి సంస్థలలో శాశ్వత ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఉదాహరణకు విశాఖపట్నం పోర్టులో 1991 నాటికి 13,019 మంది శాశ్వత కార్మికులుండగా 2021 నాటికి కేవలం 2,700 మంది మాత్రమే ఉన్నారు. షిప్‌యార్డులో 6,795 నుండి ఇదే కాలంలో కార్మికుల సంఖ్య 530 మందికి పడిపోయింది. బిహెచ్‌పివి 4వేలు నుండి 550కు తగ్గిపోయింది.

విశాఖ నగరానికే కాక, రాష్ట్రానికే తలమానికంగా ఉన్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ భారీ పరిశ్రమ ప్రభుత్వ రంగం నుండి వైదొలగడమంటే అది విశాఖ అభివృద్ధికి ఆశనిపాతమే. దీనిని పరిరక్షించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని పారిశ్రామిక విధానాలు ప్రకటించినా ఫలితం శూన్యమే. ఆధునిక టెక్నాలజీ, ఓడరేవు కలిగి దేశంలోనే విశిష్ట స్థానంలో నిలిచిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడే బాధ్యత రాష్ట్ర ప్రయోజనాల రీత్యా రాష్ట్ర ప్రభుత్వంపైనా ఉంది.

నగరాభివృద్ధిలో విశేషమైన పాత్ర పోషించిన ఇటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం ద్వారానే అభివృద్ధిని సుస్థిరం చేసుకోవడం, మరింత అభివృద్ధి సాధించడం సాధ్యం. సాధారణ ప్రజానీకం, అభివృద్ధి కాముకులు ఈ దిశలో కృషి చేసి, ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించుకునేలా ఒత్తిడి తేవడమే నేటి కర్తవ్యం.

ఎన్నికల ముందు స్టీల్ ప్లాంట్‌ను కాపాడతామని హామీ ఇచ్చిన తెలుగుదేశం, జనసేన పార్టీలు ఆ హామీకి కట్టుబడి ఉండేలా రాష్ట్ర ప్రజలు చైతన్యం చూపాలి.

- ఎ.అజశర్మ,
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక.



విశాఖపట్నం పోర్టు

కేరళ ప్రత్యామ్నాయం - పారిశ్రామిక రంగం

మానవాభివృద్ధి సూచికలలో నిరంతరం పురోగమించడం ద్వారా గుర్తింపు పొందిన కేరళ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దీనికి కారణం ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు నికరంగా ఆ రాష్ట్రంలో జరుగుతున్న కృషి. కేరళ అభివృద్ధి నమూనాలో అందరికీ విద్య, ఆరోగ్యం అందించడం ద్వారా అంతర్జాతీయంగా మన్ననలు పొందింది. ఉత్పత్తి రంగాలైన వ్యవసాయం, పరిశ్రమల వంటి వాటిలో పురోగమించకుండా ఈ నమూనా కొనసాగించగలమా అని ఇఎంఎస్ నంబూద్రిపాద్ ఒకసారి అభిప్రాయం వ్యక్తం చేశారు. గత రెండు ఎల్‌డిఎఫ్. ప్రభుత్వాలు రెండు కీలక అంశాలపై దృష్టి సారించాయి. సామాజిక సేవా రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా నాణ్యమైన విద్య, ఆరోగ్య సదుపాయాలు, సంక్షేమం అందించడం, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తూ వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో ఉత్పత్తి పెంచడం.

ప్రభుత్వ నూతన పారిశ్రామిక విధానం 'ప్రకతి-ప్రజలు-పరిశ్రమలు' నినాదంతో కేరళ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి ప్రత్యేక సవాళ్ల దృష్టితో రూపొందింది. పర్యావరణం పరిస్థితి, అందుబాటులో ఉన్నా భూమి ధర, రాష్ట్ర పారిశ్రామికీకరణకు ఆటంకంగా ఉండడంతో ప్రభుత్వ దృష్టి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలపైన, మేధస్సు ఆధారిత పరిశ్రమలపై కేంద్రీకరించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 'ఇయర్ ఆఫ్ ఎంటర్‌ప్రైజెస్' క్యాంపెయిన్ ప్రారంభించిన ప్రభుత్వం, ఆ ఒక్క సంవత్సరంలో లక్ష కొత్త సంస్థలను ఏర్పాటు చేయాలని లక్ష్యం చేసుకుంది. ముఖ్యమంత్రి హాజరయ్యే సమావేశాలకు ఆయా శాఖల మంత్రులను భాగస్వామ్యం చేయడం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సారథ్యాన ఉన్నత స్థాయి కమిటీ వేసి ఈ క్యాంపెయిన్‌ను పర్యవేక్షించారు. పరిశ్రమల మంత్రిత్వశాఖ కూడా చిన్న తరహా పరిశ్రమల సంఘాలను, కార్మిక యూనియన్‌లను సంప్రదించడం ద్వారా ఇవి సక్రమంగా అమలుచేయడానికి కృషి చేసింది.

ఈ క్యాంపెయిన్ విజయవంతానికి, స్థానికంగా పారిశ్రామికాభివృద్ధికి పారిశ్రామిక విభాగం మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను రిక్రూట్ చేసుకుంది. చిన్న పెట్టుబడిదారులను ప్రోత్సహించడానికి నాలుగు శాతం వడ్డీ రేటు తగ్గించి, వడ్డీ మినహాయింపు పథకాన్ని ప్రవేశపెట్టింది. సూక్ష్మ, చిన్న పెట్టుబడిదారులకు ఉపయోగకరంగా ఉండేట్లు రుణ మేళాలను నిర్వహించింది. స్థానిక పరిశ్రమల్లో టెక్నాలజీ వినియోగం పెంచడానికి, మంత్రిత్వశాఖ రీసెర్చ్ సంస్థలతో సమావేశాలు నిర్వహించి టెక్నాలజీ బదలాయింపునకు ప్రయత్నం చేసింది. నిర్దిష్ట సర్వే, సంప్రదింపుల ద్వారా స్థానిక తయారీలో చేయగలిగిన ప్రధాన ఉత్పత్తులను మంత్రిత్వశాఖ గుర్తించింది.

ఎంఎస్‌ఎంఇ.ల లైసెన్సింగ్ విధానంలో ప్రభుత్వం గణనీయమైన మార్పు చేసింది. మొదటి మూడున్నరేళ్ల లైసెన్స్‌లకు మినహాయింపునిచ్చి, దాని తర్వాత అవసరమైన అన్ని లైసెన్సులు పొందేట్లు అవకాశం కల్పించింది. ఆన్‌లైన్ విధానంలో సింగిల్ విండో పద్ధతిన పూర్తి చేయడమనే ఒక్క నిబంధనే పెట్టారు. ఈ క్యాంపెయిన్ తన లక్ష్యాన్ని ఆరు నెలల్లో చేరుకోవడమే కాకుండా తర్వాత ఆర్థిక సంవత్సరాలలో కూడా కొనసాగింది. 2024 నవంబర్ నాటికి 3,21,581 ఎంఎస్‌ఎంఇ.లు రూ. 20,625 కోట్ల పెట్టుబడితో 6,82,241 ఉద్యోగాలను కల్పించారు. వ్యక్తిగత పొదుపు, బంగారం, ఎన్నారైల నుండి వచ్చిన సొమ్ము పారిశ్రామిక పెట్టుబడిగా మారింది. స్థానిక ఆర్థిక వ్యవస్థను ఇది బలోపేతం చేసింది.

అందర్నీ భాగస్వామ్యం చేయడమనేది ఈ క్యాంపెయిన్‌లో కీలక అంశం. నూతన వ్యాపారం ప్రారంభించిన వారిలో 1,02,942 మంది మహిళలు, 37 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. సామాజిక తరగతులుగా చూస్తే షెడ్యూల్డ్ కులాల నుండి 11,794, షెడ్యూల్డ్ తెగల నుండి 945, మైనార్టీల నుండి 23,645 మంది ఉన్నారు. వచ్చిన సంస్థల్లో 45,233 తయారీ రంగంలోవి కాగా, సేవా రంగంలో 1,33,576 వచ్చాయి. ఈ వివరాలన్నీ పబ్లిక్ డొమైన్‌లో ఉన్నాయి.

ఎంఎస్‌ఎంఇలకు అండగా ఉండడానికి చార్టెడ్ అకౌంటెంట్స్ సంస్థ ఐసిఎఐ. జిల్లా స్థాయిల్లో హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేసి జిఎస్‌టి రిటర్న్స్, ఆర్థిక పత్రాలు తయారీ వంటి ఉచిత సేవలందించింది. ప్రభుత్వం కూడా జిల్లా స్థాయిలలో ఎంఎస్‌ఎంఇ క్లినిక్‌లను ఏర్పాటుచేసి టెక్నికల్, మేనేజ్మెంట్, మార్కెటింగ్ రంగాల్లో వృత్తిపరమైన నైపుణ్యం ఉచితంగా అందించింది. వీటికి అదనంగా ఎంఎస్‌ఎంఇల ఇన్సూరెన్స్ ప్రీమియంలపై 50 శాతం రాయితీ ఇస్తూ నూతన ఇన్సూరెన్స్ పథకాన్ని తీసుకొచ్చింది. మార్కెట్లో అవకాశం కల్పించడానికి ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖతో పరిశ్రమల శాఖ ఒక ఒప్పందం కుదుర్చుకుని స్థానిక పరిశ్రమలకు రేషన్ షాపులకు అనుసంధానంగా కె.షాపులకు ఉచిత స్థలం కేటాయించారు. ఆరు నెలల్లో ఈ కె షాపులు రూ.10 కోట్ల అమ్మకాలు చేశాయి. ప్రభుత్వ రంగ సంస్థలు, సాంప్రదాయక రంగాలు, ఎం.ఎస్.ఎం.ఇ.లు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి అనువుగా ఆన్‌లైన్ ప్లాట్ ఫారాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. కార్మికుల్ని భాగస్వామ్యం చేస్తూ మంచి స్థాయిలో నాణ్యతను, పర్యావరణ బాధ్యత, నియమాలకు కట్టుబడి చేస్తున్న ఉత్పత్తులను పెంచడానికి "కేరళ బ్రాండ్" తెచ్చారు. అధికారులు వ్యక్తిగతంగా కొత్త సంస్థలను పర్యవేక్షించి జియో టాగింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. తమ విభాగం ద్వారా ఇబ్బంది పడుతున్న పెట్టుబడిదారుల ఉనికికి, అభివృద్ధికి సహకారం అందించారు. ఈ రకంగా ప్రభుత్వం కొత్త ఎంఎస్‌ఎంఇల పరిరక్షణకు కృషి చేసింది.

'మిషన్ థౌజండ్' అనే పథకాన్ని ప్రభుత్వం తీసుకురావడం ద్వారా రూ. 100 కోట్ల సగటు టర్నోవర్ ఉండేలా అవసరమైన ఆర్థిక సహాయాన్ని తోడ్పాటును అందించి వెయ్యి పరిశ్రమల అభివృద్ధికి కృషి చేసింది. క్యాంపస్ పారిశ్రామిక పార్కుల పేరిట ప్రవేశపెట్టిన వినూత్న పథకం ద్వారా చిన్న పరిశ్రమలకు ఆయా క్యాంపస్‌లలో భూమిని కేటాయించి, గంటల వారీ వేతనంతో విద్యార్థులను వినియోగించుకోవడం ద్వారా విద్యకూ, ఇటు పరిశ్రమలకూ ప్రత్యక్ష సంబంధం కల్పించారు. ఈ రకమైన ప్రయత్నాలన్నీ కూడా కేరళ రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఇలు పారిశ్రామిక సంవత్సరంలో పుంజుకోవడానికి దారితీశాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ఇది ఉత్తమమైన ప్రయత్నమని కొనియాడింది.

ఇటీవలే ప్రభుత్వం గృహాధారిత చిన్న వ్యాపారాలకు కూడా పారిశ్రామిక లైసెన్సులు మంజూరు చేసి విద్యాధికులైన గృహ యజమానులు సంపాదన పెంచుకునేట్లు చూడాలని నిర్ణయించింది. స్వయం సహాయక గ్రూపుల కోసం ప్రారంభించిన 'కుటుంబశ్రీ' పథకం ప్రస్తుతం అతి సూక్ష్మ, సూక్ష్మ పరిశ్రమలపైన కేంద్రీకరించింది. మొత్తంగా ఈ ప్రయత్నాలన్నీ కేరళ రాష్ట్రాన్ని ఎంఎస్‌ఎంఇలకు కేంద్రంగానూ, రాష్ట్రవ్యాప్తంగా ఆర్థిక పురోగతి స్థిరత్వానికి తోడ్పడే దిశగా సాగుతున్నాయి.

- పి.రాజీవ్



తీరంలో మరో ఆకర్షణ

త్వరలో ప్రారంభం కానున్న హెలికాప్టర్ మ్యూజియం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

విశాఖ ఆర్‌కె బీచ్ రోడ్డులో మరో కొత్త పర్యాటక ప్రాజెక్టు సిద్ధమవుతోంది. బీచ్ రోడ్డులో ఇప్పటికే ఉన్న టియు- 142 యుద్ధ విమాన మ్యూజియం పక్కనే యుహెచ్ -3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. వియంఆర్‌డిఎ ఆధ్వర్యాన దాదాపు రూ.2.2 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు రూపు దిద్దుకుంటోంది. భారత నౌకా దళంలో 17 ఏళ్ల పాటు అవిరళంగా సేవలందించిన ఈ హెలికాప్టర్‌కు కొద్ది నెలల క్రితం విశ్రాంతినిచ్చారు. విపత్తు సమయంలోనూ, తీరప్రాంత భద్రతలోనూ ఇది ఎంతో కీలక పాత్ర పోషించింది. దీని ప్రాముఖ్యత గుర్తించిన వియంఆర్‌డిఎ భారత నౌకా దళ సత్తాను చాటి చెప్పేలా, పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచేలా మ్యూజియంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఈ ప్రాంగణంలో సుందరీకరణ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. రానున్న 2, 3 వారాలలో దీనిని ప్రారంభించేందుకు అధికారులు (మిగతా లోపలి పేజీలో..)

దయనీయం.. శ్రామిక మహిళల బతుకులు

ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో శ్రామిక మహిళల పరిస్థితి పెనంలోంచి పొయ్యిలోకి పడింది. పెట్టుబడిదారుల లాభాపేక్షకు శ్రామిక మహిళలు అందరికంటే ఎక్కువ దోపిడీకి గురౌతున్నారు. స్త్రీల పట్ల సమాజంలో ఉన్న వివక్షతను ఈ దోపిడీ మరింత పెంచుతోంది. కులవివక్షత, మతోన్మాదం, స్త్రీల పట్ల వివక్షత, పురుషాధిపత్యం, పెట్టుబడిదారీ వ్యవస్థలు మూకుమ్మడిగా శ్రామికమహిళలపై దాడి చేస్తున్నాయి. రోజు రోజుకూ పనిగంటలు పెరుగుతున్నాయి. శ్రామిక మహిళలలో అత్యధిక శాతం చేసే పనులు ఏ చట్టపరిధిలోకీ రావు. అసంఘటిత రంగంలో మరింత శ్రామిక మహిళలు పనిచేస్తున్నారు. అత్యల్ప వేతనాలు పొందుతున్నారు. రక్షణలేని, హీన పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. స్త్రీని వ్యాపార వస్తువుగా, సెక్స్ సింబల్‌గా చూస్తున్న నేటి వ్యాపార ప్రపంచం కారణంగా లైంగిక వేధింపులు, హత్యాచారాలు విపరీతంగా పెరిగాయి. వీటన్నింటి కలబోత విషవలయంలో శ్రామిక మహిళలు పని చేయాల్సి వస్తోంది.



మెజారిటీ మతోన్మాదం పాతకాలం నాటి కాలం చెల్లిన మనువాదాన్ని నేటి సమాజం మెదళ్లలోకి చొప్పిస్తున్నారు. మహిళలు ఇంటికి పరిమితమైతే చాలు.. ఉద్యోగం/పని చేయనవసరం లేదు. పిల్లలను కనడం, వారిని పెంచడమే స్త్రీల కర్తవ్యమని ప్రబోధిస్తున్నారు. ఆడవాళ్లు రాత్రిళ్లు బయటకు రాకూడదని, అత్యాచారాలు జరిగితే ఆడవాళ్లదే బాధ్యతని చెబుతున్నారు. వేతనాలు పెంచాలి, హక్కులు కావాలని అడిగితే ఉద్యమాలను పనికిరాని పనులుగా ప్రచారం చేస్తున్నారు.

2002లో గుజరాత్ గోద్రా అల్లర్లలో సామూహిక అత్యాచారానికి గురైన బిల్కిస్ బానో కేసులో దోషులను కొద్ది రోజుల క్రితం విడుదల చేసి, పూలమాలలతో సత్కరించారు. మన దేశంలో సామూహిక అత్యాచారం చేసే నేరస్తులకు సన్మానాలు జరుగుతున్నాయి. కాశ్మీర్‌లో అసిఫా అనే ఆరేళ్ల పాపపై మతోన్మాదుల హత్యాచారం మన కళ్లముందు సజీవ సాక్ష్యంగా ఉంది. ఈ మెజారిటీ మతోన్మాదం, దానికి సవాలుగా బయలుదేరిన మైనారిటీ మతోన్మాదం అమాయకుల ప్రాణాలు తీస్తున్నాయి. వాస్తవానికి మతోన్మాదం వారి సిద్ధాంతం. మహిళలను మళ్ళీ ఇంటికే పరిమితం చేయాలని ఈ మతోన్మాదం చూస్తోంది. అబలగా పరాన్న జీవిగా మారుస్తోంది.. లేదా చంపుతోంది. లేదా కుటుంబాలను రోడ్డున పడేస్తోంది. అందుకే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, హింసలేని సమాజం కోసం జరిగే పోరాటానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలి.



ప్రజలను ఈ మత హింసలోకి తోసి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు ప్రజలను దోచుకుంటున్నాయి. ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఆదాయాలు పడిపోతున్నాయి. ఇంటిల్లిపాది పని చేసినా అప్పులు తీర్చలేకపోతున్నారు. పౌష్టికాహారం తీసుకోలేకపోతున్నారు, పైసా దాచుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆడవాళ్ళు చేసే పనికి తగిన గుర్తింపు, న్యాయంగా, చట్టపరంగా రావాల్సిన వేతనాలు అమలు కావడం లేదు. బ్రాండిక్స్‌లో పనిచేసే మహిళా కార్మికుల నెల వేతనం ఇప్పటికీ రూ.8 వేలుగానే ఉంది. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల నెల వేతనం రూ.3 వేలు మాత్రమే. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న



భోజన పథకం, విఒఎ, ఆర్‌పిలు, పాఠశాల శానిటేషన్ వర్కర్లు మొదలగు ప్రభుత్వ పథకాల్లో పనిచేసే స్కీం వర్కర్లు, మహిళా కార్మికులకు కేంద్ర ప్రభుత్వం గడచిన పదేళ్ల కాలంలో వేతనాలు పెంచలేదు. ప్రజలకు కీలకమైన సేవలను క్షేత్రస్థాయిలో అందించే ఈ స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయకుండా, వేతనాలు పెంచకుండా ప్రభుత్వం దోచుకుంటోంది. కోట్ల సంఖ్యలో ఉండే ఇంటి పనివారలకు ఒక చట్టం లేదు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే మహిళా కార్మికులకు నామమాత్రంగా కూలి చేస్తున్నారు. వ్యవసాయ పనులు నానాటికీ తగ్గిపోతున్నాయి. వ్యవసాయ సంక్షోభం వల్ల ఎక్కువ పనులు కోల్పోతున్నది శ్రామిక మహిళలే. ఇలా ప్రతి రంగంలో శ్రామిక మహిళలు అత్యల్ప వేతనాలు మాత్రమే పొందుతున్నారు. ఏ చట్టమూ వర్తించని పనులు మాత్రమే మెజారిటీ మహిళలకు దొరుకుతున్నాయి. కుటుంబ సంక్షోభం కారణంగా రోజురోజుకూ మహిళలు పని వెతుక్కుంటూ రోడ్లపైకి వస్తున్నారు.

ముఖ్యంగా గ్రామాల నుంచి నగరాలకు వలస వచ్చే కుటుంబాల్లో మహిళలు బిల్డింగ్ పనికి, పాచి పనికి కుదురుతున్నారు. ఈ పనుల్లో వేతనాలు తక్కువ. ముఖ్యంగా బిల్టింగ్ కార్మికుల్లో ఇప్పటికీ సమాన పనికి సమాన వేతనం అమలు కావడం లేదు. ఇక కొద్దిపాటి శాతంగా ఉన్న సంఘటిత రంగంలో పని చేస్తున్న మహిళలను ప్రమోషన్స్‌లో వివక్షత, ప్రసూతి సెలవులు, వేతనాలు, అధికారుల వేధింపులు, లైంగిక వేధింపులు, సెలవులు వంటి సమస్యలు చుట్టిముడుతున్నాయి. లైంగిక వేధింపుల నిరోధానికి అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు నామమాత్రంగా వుంది. మన దేశంలో మహిళల స్థితిగతలను మార్చడానికి అనేక ఉద్యమాలు. జరిగాయి, జరుగుతున్నాయి. అర్ధరాత్రి ఒంబరిగా ఆడమనిషి నడిచిన రోజున నిజమైన స్వాతంత్ర్యం అని గాంధీజీ అన్నారు.

ఒక సమాజం యొక్క అభివృద్ధి, ఆ సమాజంలో స్త్రీల స్థితిగతులను బట్టి అంచనా వేయాలని అంబేద్కర్ అన్నారు.

బానిసకు బానిస స్త్రీ అని కారల్‌మార్క్స్ అన్నారు.

ప్రతి వంటగత్తె రాజకీయవేత్త కావాలని లెనిన్ అన్నారు. ఆధునిక మహిళ చరిత్రను పునర్లిఖిస్తుందని గురజాడ అన్నారు.

వంటగది రద్దు అయితేనే స్త్రీ స్వాతంత్ర్యం అభివృద్ధి సాధ్యమని గురజాడ చెప్పారు. ఈ పూర్వరంగంలో నేటి విషవలయానికి వ్యతిరేకంగా మొత్తం కార్మికోద్యమం పనిచేయాలని ఈ పోరాటాల్లో శ్రామిక మహిళలు ముందు పీఠిన నిలబడాలని సిఐటియు పిలుపునిస్తోంది.

- పి.మణి,
శ్రామిక మహిళా యూనియన్ నాయకురాలు



తీరంలో మరో ఆకర్షణ

(కొనసాగింపు) సన్నాహాలు చేస్తున్నారు. హెలికాప్టర్ చుట్టూ పచ్చని లాన్‌లు, ప్రత్యేకమైన మొక్కలు, ఆకర్షణీయమైన వాటర్ ఫౌంటెన్‌లను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో విద్యుత్ కాంతుల్లో మరింత అందంగా కనిపించేలా దీన్ని చుట్టూ అద్దాల నిర్మాణం చేపట్టారు. త్వరలోనే సందర్శన వేళలు, టికెట్ ధరల వివరాలను విఎంఆర్‌డిఎ ప్రకటించే అవకాశం ఉంది. నేటి యువతరం సెల్ఫీలు, ఫొటోలు పట్ల చూపిస్తున్న ఆసక్తిని దృష్టిలో ఉంచుకొని మ్యూజియం లోపల భాగాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు.



ఇప్పటికే ఐదు మ్యూజియంలు

ఆర్‌కె.బీచ్‌లో ఇప్పటికే ఐదు మ్యూజియంలు ఉన్నాయి. అందులో జివిఎంసికి చెందిన మత్స్యదర్శిని మినహా మిగిలిన నాలుగు, తూర్పు నౌక దళానికి చెందినవే. అందులో ఒకటి నేవీకి సంబంధించిన నౌకలు ఆయుధాలతో కూడిన విశాఖ మ్యూజియం కాగా, మరొకటి కురుసుర సబ్ మెరైన్ మ్యూజియం. మిగిలిన రెండింటిలో ఒకటి టియు-142 యుద్ధ విమానం కాగా, మరొకటి సీ హ్యారియర్ ఐబి కాప్టర్ మ్యూజియం. చాలాకాలంగా బీచ్ రోడ్డులో నేవీ మ్యూజియం కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని భావించారు. దీనికి విఎంఆర్‌డిఎ సహకారాన్ని నేవీ అధికారులు కోరారు. మ్యూజియం కాంప్లెక్స్ ఎలా ఉండాలనే దానిపై ఐదేళ్ల క్రితమే చర్చలు జరిగాయి. అయితే అన్నింటినీ తీసుకొచ్చి ఆర్ కె బీచ్ లో పెడితే ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుందని, పార్కింగ్ సదుపాయాలు లేవని, స్థానిక రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అభ్యంతరం వ్యక్త పరచడంతో, కాంప్లెక్స్ నిర్మాణం ప్రతిపాదన ఆగిపోయింది. అయితే నేవీలో కమిషనింగ్ చేసిన వాటిని విఎంఆర్‌డిఎ చాలా చక్కటి మ్యూజియంలుగా మార్చి ప్రజాదరణ పొందేలా తీర్చి దిద్దడంతో, తూర్పు నౌకాదళం మరో ప్రతిపాదనతో ముందుకు వచ్చింది. హెలికాప్టర్ మ్యూజియం, ఐఎన్‌ఎస్ డేగాలో డీ కమిషనింగ్ జరిగిన 'యుహెచ్-హెచ్' హెలికాప్టర్‌ను ఇవ్వడానికి ముందుకు వచ్చింది. దానిని కూడా మ్యూజియంగా మార్చాలని కలెక్టర్ ద్వారా విఎంఆర్‌డిఎను కోరింది. దానికి వారు సానుకూలంగా స్పందించిన నేపథ్యంలో ఆర్‌కె బీచ్ లోని టియు-142 యుద్ధ విమానం, సీ హ్యారియర్ మ్యూజియాల చెంతనే, ఎయు కన్వెన్షన్ సెంటర్ ముందు యుహెచ్-మ్యూజియం ఏర్పాటుకు నిర్ణయించి, పనులు చేపట్టారు.

సీ హ్యారియర్‌లా దీనిని గాలిలో వేలాడ దీయకుండా, కిందనే ఉండేలా డిజైన్ చేశారు. మూడు వైపులా ఫేస్ (ముఖద్వారం) వచ్చేలా అద్దాలతో చక్కటి డిజైన్ రూపొందించారు. ప్రారంభంలో దీని నిర్మాణానికి రూ.80 లక్షలు ఖర్చు కావచ్చని అంచనా వేశారు. అయితే ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన జాప్యం కారణంగా దీని ఖర్చు రూ.2.2 కోట్లకు చేరింది.

తిరోగమన దిశలో ఇన్సూరెన్స్ చట్ట సవరణలు!

ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ - ఎఫ్‌డిఐ) 74 శాతం నుండి 100 శాతానికి పెంచనున్న ప్రతిపాదనలపై ప్రజల నుండి అభిప్రాయాలు ఆర్థికశాఖ ఆధ్వర్యంలోని డిపార్ట్మెంట్ అఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డిఎఫ్ఎస్) ఆన్లైన్ ద్వారా కోరింది. డిసెంబర్ 10లోపు తమ అభిప్రాయాల్ని తెలియజేయాలంది. ఎన్నుకోబడిన ప్రభుత్వం ఇలా కొన్ని అంశాలపై ప్రజాభిప్రాయాన్ని సేకరించే ప్రయత్నం చేస్తున్నట్లుగా ప్రకటించుకోవడంలోనే వాటి చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా మారింది. ఈ దేశంలో ఆన్లైన్ ద్వారా ఆర్థిక అంశాల పట్ల తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచే అవకాశాలు, తమ అనుయాయుల నుండి తప్ప చాలా తక్కువ. అలాంటి అభిప్రాయాలు స్వీకరించాలనుకుంటే ఇన్సూరెన్స్ రంగానికి సంబంధించిన ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, ఏజెంట్లు, ఏజెంట్ల సంఘాలు, పాలసీదారులు, ఇతరత్రా మేధావుల నుంచి సేకరిస్తే ప్రయోజనం ఉండే అవకాశం ఉంది. అలా కాకుండా సామాన్య ప్రజానీకం నుండి అభిప్రాయ సేకరణకు ప్రయత్నిస్తే ఫలితం ఉండదు. నిరంతరం అందులోనే మునిగి తేలుతున్న ఉద్యోగులు, ఏజెంట్ల అసోసియేషన్లతో తక్షణమే సంప్రదించడం అత్యావశ్యకం. ప్రజాభిప్రాయ సేకరణకు ప్రాధాన్యతనిచ్చే ప్రభుత్వాలే అయితే 1998లోనే దేశవ్యాప్తంగా కోటీ 65 లక్షల సంతకాలు ఇన్సూరెన్స్ రంగంలో ప్రైవేట్ కంపెనీలకు అవకాశం ఇవ్వొద్దని అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగికి సమర్పించారు. ఇతర అనేక సందర్భాల్లోనూ ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల అవసరం లేదని, సదరు ఎఫ్‌డీఐలు ఏవిధంగా సర్వీస్ రంగంలో ప్రధాన భూమిక పోషిస్తున్న ఇన్సూరెన్స్ రంగానికి నష్టం కలిగిస్తాయో కూడా ప్రభుత్వాలకు వివరించారు. ఇన్సూరెన్స్ రంగంలో ఎఫ్‌డీఐ పెంపుదలపై ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీ ముందు కూడా ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కామ్రేడ్ అమానుల్లా ఖాన్, కామ్రేడ్ కె.వేణుగోపాల్ తమ వాదనలు వినిపించారు కూడా. ఇలా వ్యక్తీకరించబడిన ఏ సందర్భంలోనూ ప్రజాభిప్రాయానికి గానీ లేదా సంఘాల అభిప్రాయాలకు గానీ విలువ ఇవ్వకుండా, ఇప్పటి కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఇన్సూరెన్స్ రంగంలోకి ఎఫ్‌డీఐలను క్రమం తప్పకుండా పెంచుతూనే ఉంది. ఇప్పటికిప్పుడు ఉన్నపళంగా ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా కొత్త కొత్త మార్పులకు శ్రీకారం చుట్టి తమ చేతికి రక్తం అంటుకోకుండా బయటపడాలన్న ఆలోచన తప్ప మరోటి కాదు. 245 ప్రైవేట్ కంపెనీల మోసాలను అరికట్టి ప్రజలకు న్యాయమైన పద్ధతిలో ఇన్సూరెన్స్ ను అందిస్తూ, చిన్నమొత్తాల పొదుపులను సేకరించి మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వానికి నిధులు సమకూర్చాలని, ఇన్సూరెన్స్‌ని ప్రతి మారుమూల ప్రాంతానికి చేరవేయాలనే లక్ష్యంతో 1956లో ఇన్సూరెన్స్ రంగాన్ని జాతీయీకరిస్తూ జవహర్‌లాల్ నెహ్రూ ఎల్.ఐ.సి. ఆఫ్ ఇండియాని ఏర్పాటుజేశారు. అయితే, 1995 వరకు ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో నడిచే ఇన్సూరెన్స్ రంగాన్ని రెగ్యులేట్ చేయడం కోసం ఒక కొత్త రెగ్యులేటరీ సంస్థ అవసరమని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అథారిటీ (ఐ.ఆర్.ఎ.) అనే ప్రతిపాదనను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది. పార్లమెంట్‌లో ఈ బిల్లును పాస్ చేయించడం కోసం నాటి ఆర్థిక మంత్రులు ఐకే గుజ్రాల్, పీ చిదంబరం వేరు వేరు సందర్భాల్లో విశ్వ ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. 1999లో బిజెపి ఆధ్వర్యంలోని వాజ్‌పేయి ప్రభుత్వం ఈ ఐఆర్ఎ అనే పదాన్ని ఐఆర్‌డిఏ (ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ)గా నామకరణం చేస్తూ పార్లమెంట్‌లో బిల్లును కాంగ్రెస్ పార్టీ సాయంతో ఆమోదింపజేసుకున్నది. ఈ బిల్లు పాస్ అయినప్పుడు ఇన్సూరెన్స్ రంగంలోకి ప్రైవేట్ కంపెనీలు రావచ్చు; అయితే 26 శాతం మాత్రమే ఎఫ్‌డీఐలు ఉండాలన్న నిబంధన ఉంచారు. ఆశించిన మేర ప్రైవేట్ కంపెనీలు నమోదు కాకపోవడంతో ఎఫ్‌డీఐని మరింత పెంచాలని తద్వారా విదేశీ కంపెనీలు వస్తాయని చాలా ప్రయత్నాలు చేశారు. కానీ యూపీఏ (కాంగ్రెస్ ఆధ్వర్యంలో) వన్ ప్రభుత్వం ప్రభుత్వ రంగాలకు పెద్దపీట వేసే వామపక్ష పార్టీల మద్దతుతో ఉండడంతో అది సాధ్యపడలేదు. మళ్లీ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత 2015లో ఎఫ్‌డీఐ 26 నుండి 49 శాతానికి పెంచారు. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదనే నెపంతో 2021లో దీనిని 74 శాతానికి కూడా పెంచారు. ఆ తర్వాత కూడా ఈ 25 ఏళ్ల కాలంలో అన్ని ప్రైవేట్ కంపెనీలు కలిపి 25 శాతం కూడా మించలేకపోయాయి. అందుచేత ఇప్పుడు ఇన్సూరెన్స్ రంగంలో వందశాతం ఎఫ్‌డీఐలను పెంచడం ద్వారా పుట్టగొడుగుల్లా ప్రైవేట్ కంపెనీలు వెలసి ఇన్సూరెన్స్ రంగాన్ని అభివద్ధిపరచగలవన్న "గాలిలో మేడలు" వంటి ఆశావాహ దక్పథాన్ని కేంద్ర ప్రభుత్వం కలగంటోంది. ఇక నుండి దేశీయ భాగస్వామ్యం కలిగిన కంపెనీ లేవీ ఇన్సూరెన్స్ రంగంలో ఉండకుండా విదేశీ కంపెనీలు తమ దుకాణాలను ఇక్కడ తెరవవచ్చు. ఇప్పటికే ఇన్సూరెన్స్ బ్రోకరేజీకి సంబంధించిన రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతి ఉన్నది. అయినప్పటికీ ఈ బ్రోకరేజీ వ్యవస్థల ఫలితాలు ఆశించిన మేర లేవు. అంటే భారత ప్రజానీకం ప్రైవేట్ ఇన్సూరెన్స్ రంగం పట్ల అంతగా ఆసక్తి కనబరచడం లేదని స్పష్టమవుతుంది. కారణమేమంటే దీర్ఘకాలిక పొదుపు పట్ల, మరణానంతరం కుటుంబానికి లభించే సొమ్ము పట్ల ప్రభుత్వ గ్యారంటీ కలిగిన ప్రభుత్వ రంగాన్ని ఎంచుకుంటున్నారు అని అర్థం. అయినప్పటికీ న్యూ మిలీనియల్‌గా పిలువబడే యువతను వక్ర ప్రకటనల ద్వారా ప్రైవేట్‌రంగం కొంత మార్కెట్ వాటాను చేజిక్కించుకునే ప్రయత్నం చేస్తోంది. అయినా కూడా మిస్ సెల్లింగ్ అని మాల్‌ప్రాక్టీస్ అని అనేక సందర్భాల్లో ఐఆర్‌డిఎఐ ప్రైవేట్ కంపెనీలకు జరిమానాలు విధిస్తూనే ఉన్నది. ఇప్పుడు ప్రతిపాదిస్తున్న ఇన్సూరెన్స్ చట్టాల సవరణ బిల్లులో అనేక ప్రమాదకర అంశాలున్నాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రారంభించాలంటే రూ.100 కోట్ల కనీస మూలధనం అవసరం. దాన్ని తగ్గించాలనే ప్రతిపాదన ఇందులో ఉంది. ఎల్.ఐ.సి. ఆఫ్ ఇండియా పూర్తి ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్నది కాబట్టి రూ. వంద కోట్ల మూలధనం అవసరం లేదని మొర పెట్టుకున్నా వినకుండా ఎల్.ఐ.సీ. ఆఫ్ ఇండియా నుండి రూ. వంద కోట్ల మూలధనాన్ని ఏర్పాటు చేయించారు. విదేశీ కంపెనీలను సంతప్తి పరచడం కోసం ఇప్పుడు ఇదే నిబంధనను తొలగిస్తున్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలు సింగిల్ రిజిస్ట్రేషన్‌తో లైఫ్, జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్ వ్యాపారం చేసుకోవచ్చు. ఈ కాంపోజిట్ లైసెన్స్‌తో యాడ్వర్స్ (నష్ట దాయకమైనది) సెలక్షన్ జరగవచ్చనే ఆలోచనకు చరమగీతం పాడుతున్నారు. ఇన్సూరెన్స్ ఏజెంట్లు మూడు లైఫ్ ఇన్సూరెన్స్, మూడు జనరల్ ఇన్సూరెన్స్, మూడు హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఒకే లైసెన్స్‌తో పనిచేయవచ్చని మరో ప్రతిపాదన ఉంది. దీంతో ఏజెంట్ వ్యవస్థ అస్థిత్వం సందిగ్ధావస్థలో పడే ప్రమాదం ఎంతైనా ఉంది. ఈ మార్పుతో పాటు ఇన్సూరెన్స్ సంస్థలు తమ ప్రధాన విధి అయిన ఇన్సూరెన్స్ కల్పనతో పాటు ఇతర ఇండెమ్నిటీ వ్యాపారాలు, ఆస్తిపాస్తుల అమ్మకాలు, కొనుగోళ్లు వంటి ఇతర వ్యాపారాలు కూడా చేసుకునే అవకాశం కల్పిస్తారట. దీని ద్వారా ప్రధాన ధ్యేయం పక్కదారి పడుతోంది. భీమా "సుగమ్" పేరున "ఇన్సూరెన్స్ సొల్యూషన్స్ ఫ్రమ్ వన్ ప్లేస్" అనే ప్రతిపాదన ద్వారా ఇన్సూరెన్స్ మూలసూత్రాలైన "ఇన్సూరబిలిటీ ఇంటరెస్ట్, యాడ్వర్స్ సెలెక్షన్, అట్మోస్ట్ గుడ్ ఫెయిత్" వంటివన్నీ కూడా కచ్చితంగా ప్రమాదంలో పడనున్నాయి. ఇలాంటి సరళీకరణ విధానాలు తమ లాభాల కోసం ఎంతకైనా ఒడిగట్టే అవకాశాన్ని ప్రైవేట్ కంపెనీలకు ఇట్టే ఇస్తాయి. దీర్ఘకాలిక కాంట్రాక్టులకు ఆలవాలమైన ఇన్సూరెన్స్ రంగంలో ఇలాంటి సరళీకరణ విధానాలు ప్రమాదాలుగా పరిణమిస్తాయి. భారత ఇన్సూరెన్స్ రంగ తలుపులు బార్లా తెరవబడిన 25 సంవత్సరాల తర్వాత కూడా లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్ సెక్టార్లలో కలిపితే 60 కంపెనీలకు మించలేదు. ఇప్పటికే డజన్ కంపెనీలు బిచాణా ఎత్తేశాయి కూడా. క్లెయిమ్‌ల చెల్లింపుల్లోనూ బేరసారాల ద్వారా లబ్ధిదారులను ప్రైవేటు కంపెనీలు ఇబ్బంది పెడుతున్న సందర్భాలు కోకొల్లలు. ఇన్సూరెన్స్ రంగం ద్వారా (ఎల్ఐసి, జిఐసి కలిపి) దేశంలోకి వచ్చిన ఎఫ్‌డిఐలు రూ.35 వేల కోట్లను మించలేదు. భారతదేశంలో ప్రైవేట్ కంపెనీల లాభాలను మూడు సంవత్సరాలపాటు ఇక్కడే పెట్టుబడి పెట్టాలన్న నిబంధనను (రిపాట్రియేషన్ క్లాజ్) 2015లో బీజేపీ ప్రభుత్వం తొలగించిన తర్వాత విదేశీ కంపెనీలు తమ లాభాలను యధేచ్ఛగా ఎప్పటికప్పుడు తరలించుకుపోతూనే ఉన్నాయి. ఇలాంటి అనుభవం ఉన్న తర్వాత కూడా మరింత సరళీకరించడం నికరంగా నష్టదాయకమే. అయినప్పటికీ అంతర్జాతీయ వ్యాపార ఒప్పందాల వత్తిడి, భారత ఇన్సూరెన్స్ మార్కెట్ పై విదేశీ కంపెనీల అంచనాలు, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ బాధ్యతారహిత, ప్రైవేటీకరణ విధానాలు ఇన్సూరెన్స్ రంగాన్ని తీవ్రంగా నష్టపరిచే ఇన్సూరెన్స్ చట్టాల సవరణ బిల్లును ముందుకు తెస్తున్నాయి. 2022 మే లో అట్టహాసంగా ఎల్.ఐ.సి.లోని 3.5% వాటాలను మార్కెట్‌లోకి విడుదల చేశాక ఎల్.ఐ.సి. వాటా ధర ఆశించిన ఫలితాలివ్వకపోవడంతో 'సెబి' నిబంధనల రీత్యా జరగ వలసిన తదుపరి ఉపసంహరణను కేంద్రమే 'సెబి'ని అభ్యర్థించి నిలుపుదల చేసింది. వాటాల ఉపసంహరణ తరువాత అద్భుతం ఏమీ జరగక పోగా ఎల్.ఐ.సి. అనవసరపు పోటీ తత్వాన్ని ఎదుర్కొని లాభార్జనకై శ్రమిస్తుండటంతో మూల ధ్యేయమైన "ప్రతి మారు మూల ప్రాంతాల్లోని అందరికీ ఇన్సురెన్స్" అనే నినాదం ప్రశ్నార్థకంలో పడింది. అందుచేత ప్రతిపాదిత చట్ట సవరణలు విదేశీ కంపెనీలు పుట్టగొడుగుల్లా వెలసి ప్రభుత్వ రంగాన్ని, దేశీయ ప్రైవేట్ కంపెనీలను కుంటుపర్చడమే కాకుండా ప్రజల దీర్ఘకాల పొదుపుల భద్రత కచ్చితంగా ప్రశ్నార్థకమౌతుంది. దీన్ని ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రతిఘటించాలి.

- జి.తిరుపతయ్య

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పేర్లతో...

రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన



భారత రాజ్యాంగం అమల్లోకొచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్నా "సమాన పనికి సమాన వేతనం" అమలు కావడం లేదు. దీనివల్ల దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేర్లతో అనేక సౌకర్యాలను తగ్గించి, తక్కువ వేతనాలతో ఎక్కువ పని చేయించుకుంటున్నాయి. ఇది రాజ్యాంగ ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడంతో పాటు ఆర్థిక, సామాజిక భద్రత లేకుండా చేస్తూ బహిరంగంగా శ్రమ దోపిడీకి దారితీసింది.

పౌరుడికి చట్టం ముందు సమాన హక్కును రాజ్యం నిరాకరించ కూడదని, ప్రతి ఒక్కరికీ చట్టాల నుంచి సమానమైన రక్షణ కల్పించాలని ఆర్టికల్ 14 (ఎ) హామీ ఇస్తోంది. కానీ ఒకే పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు-రెగ్యులర్ ఉద్యోగులకు మధ్య వేతన వ్యత్యాసాలు ఈ హక్కును కాలరాస్తున్నాయి. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానమైన రక్షణను ప్రభుత్వాలు కల్పించడం లేదు. ప్రభుత్వాలే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల శ్రమను భక్షిస్తూ వారిని పేదరికంలోకి, నిరంతర అభద్రతలోకి నెడుతున్నాయి. ఆర్టికల్ 16 ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగ నియామకాల్లో ఎటువంటి వివక్ష ఉండకూడదు. కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ నియామకాల పేరుతో రిజర్వేషన్లను అమలు చేయకుండా రాజ్యాంగ విరుద్ధ నియామకాలు చేస్తూ సామాజిక న్యాయాన్ని గాలికి వదిలేశాయి. అవుట్ సోర్సింగ్ నియామకాల్లో రాజకీయ సిఫార్సులు, లంచాలు రాజ్యమేలుతూ నిరుపేద నిరుద్యోగులను నిస్సహాయ స్థితికి నెడుతున్నాయి. పేదరికం నిర్మూలన, సామాజిక న్యాయం గురించి నిత్యం మాట్లాడే పాలకులు అమానవీయమైన అవుట్‌సోర్సింగ్ నియామకాలతో రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నాయి. ఆర్టికల్ 21 ప్రకారం జీవన హక్కు అంటే గౌరవప్రదమైన జీవితం. కాని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈ హక్కుకు నిరాకరిస్తున్నారు. ఆర్టికల్ 39(డి) సమాన పనికి సమాన వేతనం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేస్తుంది. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వేతనాలు రెగ్యులర్ ఉద్యోగుల వేతనాల కంటే తక్కువగా ఇవ్వడంతో రాజ్యాంగం నిర్దేశించిన సమాన పనికి సమాన వేతనం గాలి మాటగా మారిపోతుంది. నిరుద్యోగులకు పని అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆర్టికల్ 41 నిర్దేశిస్తుంది. ప్రభుత్వ శాఖల్లో సంవత్సరాల తరబడి ఏర్పడిన ఖాళీలు నింపకుండా శాశ్వత స్వభావం కలిగిన ఉద్యోగాల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ నియామకాలు చేయడం రాజ్యాంగ విరుద్ధమైనది. భద్రత లేని ఉద్యోగాలు నింపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను అమలు చేయడంలేదు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ నియామకాల వల్ల ఉద్యోగుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుంది. రెగ్యులర్ ఉద్యోగులతో పోల్చితే కాంట్రాక్టు ఉద్యోగులది తక్కువ వేతనం. సామాజిక భద్రత లేమి, పెన్షన్, ఎస్ఇసి, గ్రాట్యూటీ, వీడ్కోలు ప్యాకేజీ వంటి ప్రయోజనాలు లేకపోవడం వల్ల ఉద్యోగులు నష్టపోతున్నారు. అవుట్ సోర్సింగ్ కంపెనీలు, మధ్యవర్తుల ద్వారా నియామకాలు జరగడం వల్ల మధ్యవర్తులకు లాభం, ఉద్యోగులకు నష్టం. కాంట్రాక్టు ఉద్యోగులను ప్రోత్సాహకాలు, ప్రమోషన్లకు దూరంగా ఉంచడం వల్ల అభివృద్ధి అవకాశాలు లేకుండా పోతున్నాయి. మన రాజ్యాంగం ప్రకారం ఆదర్శ యజమానిగా ఉండవలసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో అసమానతను ప్రోత్సహించే విధానం అవలంబిస్తున్నాయి. కాంట్రాక్టు ఉద్యోగులు రిటైర్ అయినా, ఏ కారణం చేతనైనా ఉద్యోగాలు కోల్పోయినా ఆ తర్వాత పింఛన్, గ్రాట్యూటీ, ఆరోగ్య బీమా లేదా చికిత్స సదుపాయాలు అందడం లేదు. ప్రమాదాలు జరిగినప్పుడు పరిహారం, భరోసా కూడా ఉండడం లేదు.

"సమాన పనికి సమాన వేతనం" పౌరుల హక్కు మాత్రమే కాకుండా రాజ్యాంగంలో ప్రాథమిక విధానమని రంధీర్ సింగ్ కేసు (1978) తీర్పు పేర్కొంది. దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు విధానాలను రూపొందించాలని ఉమాదేవి కేసు (2006)లో సుప్రీంకోర్టు సూచించింది. సమాన పనికి సమాన వేతనం అనే హక్కును జగ్జీత్ సింగ్ కేసు (2016)లో సుప్రీంకోర్టు మరింత బలపరిచింది. తాత్కాలిక ఉద్యోగులకు కూడా రెగ్యులర్ ఉద్యోగులు వేతనాలు ఇవ్వాల్సి ఉందని తీర్పు ఇచ్చింది. కార్మికులకు వారి ప్రయోజనాలు అందకుండా చేసేందుకు కృత్రిమ ప్రాతిపదికలు సృష్టించడం తప్పు. ఒకే విధమైన బాధ్యతలు నిర్వహిస్తూ, ఒకే రకమైన పనిచేస్తున్న వ్యక్తికి (కాంట్రాక్టు పేరిట) మరో పర్మినెంట్ ఉద్యోగి కంటే తక్కువ జీతం ఇవ్వడం కుదరదు. మరీ ముఖ్యంగా సంక్షేమ రాజ్యంలో అస్సలు కుదరదు" అని ధర్మాసనం పేర్కొంది. "తక్కువ వేతనం తీసుకొని పనిచేయడానికి ఎవ్వరూ ఇష్టపడరు. తమ కుటుంబాన్ని పోషించుకునేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో తన ఆత్మగౌరవాన్ని, హుందాతనాన్ని, స్వీయ విలువను తగ్గించుకుని మరీ తక్కువ జీతానికి పనిచేస్తారు. అలా చేయకపోతే తమపై ఆధారపడిన వారికి ఇబ్బందులు తలెత్తుతాయని తెలుసు" అని తీర్పు రాసిన జస్టిస్ ఖేహర్ పేర్కొన్నారు. "ఒకే రకమైన పరిస్థితుల్లో, ఒకే రకమైన పని చేసే వారి మధ్య వేతనాల్లో తేడా ఉండటమంటే శ్రమను దోచుకోవడమే. ఇది కచ్చితంగా అణచివేత చర్యే" అని స్పష్టం చేశారు. తాత్కాలిక ఉద్యోగులను పునరుద్ధరించడంలో ప్రభుత్వాల నిబంధనల్లో స్పష్టత అవసరమని మోహనలాల్ కేసు (2021)లో సుప్రీం కోర్టు చెప్పింది.

నిర్దిష్ట కాలం పనిచేసిన తర్వాత కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసేలా విధానాలు రూపొందించాలి. సంస్థల పాత్రను పర్యవేక్షించడానికి ప్రత్యేక నియంత్రణా మండళ్లు ఏర్పాటుచేయాలి. కరువు భత్యం, ఇంటి అద్దె, పింఛన్, గ్రాట్యూటీ, ఆరోగ్య బీమా వంటి ప్రయోజనాలు అమలు చేయాలి. కనీస వేతనం, వర్క్ అవర్స్ నియంత్రణ పర్యవేక్షణలో కఠిన చర్యలు తీసుకోవాలి. కోర్టుల తీర్పులు ముఖ్యంగా సమాన వేతనం తీర్పులు, త్వరగా అమలు చేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇవ్వడంలో వారి అప్పులు మాఫీ చేయడంలో ఆసక్తి చూపుతున్నాయి కానీ పేద కుటుంబాల నుంచి వచ్చిన ఉద్యోగుల, కార్మికుల సంక్షేమంపైన దృష్టిపెట్టడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నడుస్తున్న పథకాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు, స్థానిక సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులకు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేల్ వర్తించదని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెం.2 చెప్తోంది. ఈ జీవో రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కుకు విరుద్ధమైనది. కృత్రిమ నిబంధనలతో శ్రమకు తగ్గ వేతనం ఇవ్వకుండా ఉండడమే దీని ఉద్దేశం. రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం, సమానత్వం కోసం, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలి.

- బి.కాంతారావు

దేశభక్తి

మాట్లాడకు
మౌనాన్నే ఆశ్రయించు.
కాదని గొంతు విప్పావో
ఊరికూరికే గాయపడిపోతాయి
మనోభావాలు....
అరే పిచ్చోడా!
ఇప్పుడు నిజాలు
ఎవడిక్కావాలి?
పచ్చి అబద్ధాలే
పరమప్రీతి కదా అందరికీ!
ప్రశ్నించకు మౌనాన్ని సాధన
చేయి
కాదని నిలదీశావో
నువ్వో దేశద్రోహివి జాతికి శతవ్వి
అరే వెర్రోడా!
ఇప్పుడు పురోగమనం
ఎవడిక్కావాలి?
తిరోగమనమే ఉన్నతాదర్శం కదా
అందరికీ!
ఆలోచించకు
చైతన్యాన్ని సమాధి చేసేయ్
కాదని బుర్రకు పని కల్పించావో
నువ్వో తీవ్రవాదివి, శతదేశపు
గూఢచారివి
అరే అమాయకుడా !
ఇప్పుడు భవిష్యత్తెవడికి కావాలి
మతప్రాయమైన గతమే
సంస్కృతి కదా అందరికీ !
నోరెత్తకు ప్రశ్నలు సంధించకు
ఆలోచనామతాలను వెదజల్లకు
అప్పుడు మాత్రమే
నువ్వో అపర దేశభక్తుడివి!

- రత్నాజేయ్

ఆకలి

ఆకలి నిప్పుకు రేగిన పొగలే
అన్నిటి వెనక ఆకలి సెగలే
తరతరాల నుండి తరగని నిధులే
దాచి పెట్టినది.. ఆకలి దిగులే

ఒకరికి కీర్తిపై ఆకలి
మరొకరికి కాంతపై ఆకలి
కోరికలు వేరైనా
కనిపించని పిశాచి ఆకలి

ఉద్యోగమని ఏది చేసినా
ఉద్వేగం మాత్రం ఆకలే
ఉన్నది మొత్తం ఊడ్చుకు పోయినప్పుడూ
వినిపించే చప్పుడు మాత్రం ఆకలి

ఆకలి తీర్చే ఆహారం
అందరికీ లభ్యం కావాలి
ఆలోచనల ప్రవాహం
మేలు వైపునకే నడిపించాలి

స్మరించక్కరలేని నామం ఆకలి
ప్రతి పనిలో ప్రేరణ ఆకలి
కోటి విద్యలు నేర్పింది ఆకలే
పెడతోవ పట్టిస్తుంది ఆ'కలే'

ఆకలి బాధలు తీరాలంటే
నలుగురికీ సహాయ పడాలి
గురజాడ బాటలో నడవాలి
నాకోసం, దేశం కోసం నేనే కష్ట పడాలి!

- నీలం కృష్ణమూర్తి,

ఒత్తిడి లేని విద్యతో అత్యుత్తమ ఫలితాలు

శ్రీరామానుజ సొంతం



ఆచార్య చక్రధరరావు , సీనియర్ ఫ్యాకల్టీ
శ్రీరామానుజ జూనియర్ కాలేజీ

పదవ తరగతి తరువాత ప్రముఖ విద్యాసంస్థలలో ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులలో చేరాలనుకునే విద్యార్థులకు ఒత్తిడి లేని విధంగా ఇంటర్ విద్యను అందించడంలో స్థానిక డాక్టర్స్ కాలనీలోని రామానుజ జూనియర్ కళాశాల అగ్రస్థానంలో నిలుస్తోంది. వందల సంఖ్యలో విద్యార్థులను చేర్చుకుని పదుల సంఖ్యలో మాత్రమే ఫలితాలు కనబరిచే కార్పొరేట్ కళాశాలలకు భిన్నంగా పరిమిత సంఖ్యలో విద్యార్థులను చేర్చుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించడం. ప్రతి విద్యార్థిని సొంత కుటుంబ సభ్యునిగా కౌన్సిలింగ్ ఇవ్వడం, ఒత్తిడిలేని విద్యాబోధన ఈ కళాశాల ప్రత్యేకం. విశాఖ ప్రాంతీయ కంటి ఆసుపత్రి సమీపంలో ప్రశాంత వాతావరణంలో నెలకొల్పిన రామానుజ కళాశాలపై ప్రత్యేక కథనం. గణిత శాస్త్రంలో అపార అనుభవం కలిగి, తెలుగు అకాడమీ పుస్తక రచయితగా సుపరిచితులైన కాలేజీ సీనియర్ ఫ్యాకల్టీ ఆచార్య చక్రధరరావుతో ఇంటర్వ్యూ..

ఇంటర్ విద్యలో గుర్తింపు పొందిన శ్రీరామానుజ జూనియర్ కళాశాలలో ఎలాంటి విద్యా విధానాన్ని అవలంభిస్తున్నారు?

శ్రీరామానుజ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సమగ్రాభివృద్ధిపై దృష్టిసారిస్తాం.. కేవలం పరీక్షల కోసం చదవటం కాకుండా, విషయాలను లోతుగా అర్థం చేసుకునేలా ప్రోత్సహిస్తాము. విషయాలపై విద్యార్థుల్లో ఆసక్తిని కలిగించడం, తద్వారా ఒత్తిడి లేకుండా ఆనందంగా చదివేలా చేయడమే లక్ష్యం.

చాలా కళాశాలలు పోటీ పరీక్షలపై దృష్టి పెడుతుంటాయి. మీ కళాశాల విధానం ఎలా ఉంది ?

అవును. విద్యార్థులకు విషయ పరిజ్ఞానాన్ని అందించడంపైనే మొదట దృష్టి పెడతాము. సబ్జెక్టు పూర్తిగా అర్థమైతే, పోటీ పరీక్షల్లో సులభంగా రాణించొచ్చు. గడచిన నాలుగేళ్లలో ఐఐటి, ఐఐఎస్ఇఆర్, ఐఐఎస్‌టి, ఐఐపిఇ, ఐఐఐటి, ఎన్ఐటి, సెంట్రల్ యూనివర్సిటీలలో మా విద్యార్థులు అద్భుతమైన ర్యాంకులు సాధించడానికి ఇదే కారణం.

గణితం, జీవశాస్త్ర విభాగాల్లో మీ కళాశాల విజయాలు గురించి వివరిస్తారా?

గణిత విభాగంలో 113 మంది విద్యార్థుల్లో 18 మంది అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రతిష్టాత్మక సంస్థల్లో చేరారు. ఇటీవల ఐఐటి, జెఇఇ మెయిన్స్ పరీక్షల్లో 99.493, 98.709, 98.619 వంటి అత్యుత్తమ పర్సంటైల్స్ సాధించారు. జీవశాస్త్ర విభాగంలో, 18 మంది విద్యార్థుల్లో 11 మంది నీట్‌లో మంచి ర్యాంకులు సాధించి ఆంధ్ర మెడికల్ కాలేజ్, విజయనగరం, శ్రీకాకుళంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు పొందారు.

కాలేజీ విజయాల్లో అధ్యాపకుల పాత్ర ఏమిటి?

జీతం కోసం కాకుండా, విద్యార్థులకు సరైన జ్ఞానాన్ని అందించాలనే తపనతో అత్యంత అనుభవజ్ఞులైన అధ్యాపకులు అంకితభావంతో పనిచేస్తారు. బట్టీ విధానం కాకుండా, ప్రతి విషయాన్ని అర్థమయ్యేలా వివరిస్తారు. సందేహాలను నివృత్తి చేసుకునే వరకు ప్రోత్సహిస్తారు. తరగతి గదిలో చర్చలకు ప్రాధాన్యత. గ్యాడ్జెట్లకు దూరంగా ఉండమని సూచిస్తారు.

మీ విద్యావిధానం విద్యార్థులపై ఒత్తిడిని తగ్గిస్తుందా?

కచ్చితంగా! ఒకసారి విద్యార్థికి సబ్జెక్టు పూర్తిగా అర్థమైతే, వారికి సులభంగా ఉండడమే కాకుండా ఆనందంగా చదువుతారు. తర్వాత ప్రశ్నలు, సమస్యలపై ఎక్కువగా సాధనచేసి, ఒకటికి రెండుసార్లు పాఠ్యపుస్తకాన్ని చదివితే, విషయం ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రతిరోజూ సాయంత్రం తరగతులు ముగిసిన తర్వాత 20 నిమిషాల ధ్యానం చేయిస్తాము. ఇది మెదడును రిఫ్రెష్ చేస్తుంది, ప్రశాంతంగా ఉంచుతుంది. తద్వారా మరింత ఉత్సాహంగా చదవడానికి సిద్ధమవుతారు.

చదువుతో పాటు ఇతర కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇస్తున్నారా?

తప్పకుండా! విద్యార్థులు వారానికోసారి క్రీడల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తాము. జాతీయ స్థాయి లాన్‌టెన్నిస్, క్రికెట్ పోటీల్లో కొందరు పాల్గొన్నారు. పలుమారథాన్లలో సత్తా చాటారు.

అధ్యాపకుల గురించి చెప్పండి?

రామానుజ కాలేజీలో అధ్యాపకులంతా ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులే.. 72 ఏళ్ల నన్నూరి సాంబశివరావు (ఎన్ఎస్ఆర్ సర్) గణితానికి, 74 ఏళ్ల శంకర్ (చెట్టు మాస్టారు) వృక్షశాస్త్రానికి, రామాంజనేయులు ఆర్గానిక్ కెమిస్ట్రీ, శివ ఫిజికల్, ఇన్‌ఆర్గానిక్ కెమిస్ట్రీ, జగదీష్ (సిఎస్ఐఆర్ సింగిల్ డిజిట్ ర్యాంకర్) భౌతికశాస్త్రం బోధిస్తున్నారు. నేను. ఆచార్య చక్రధరరావు, 71ఏళ్లు, ఏయూ గణితశాస్త్ర విభాగాధిపతిగా ఉద్యోగ విరమణ పొందాను. మేమందరం ప్రత్యేక రంగాలలో పరిశోధనా పత్రాలనుసమర్పించాం.మూడేళ్లుగా రామానుజ జూనియర్ కళాశాలలో ఒత్తిడి లేకుండా అద్భుతమైన ఫలితాలను అందిస్తున్నాము.

అధ్యాపకులకు యాజమాన్య సహకారం?

విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడంలో అధ్యాపకులకు యాజమాన్యం పూర్తి స్వేచ్ఛ ఉంది.

కళాశాలలో పరీక్షల విధానం ఎలా ఉంది?

ప్రతి శనివారం, ఐఐటి, నీట్ తరహాలో వారాంతపు పరీక్ష నిర్వహిస్తాము. ఆదివారం పూర్తిగా విశ్రాంతి దినం. అయితే, ఆసక్తి ఉన్న విద్యార్థులు వారాంతపు పరీక్ష పత్రాన్ని పరిశీలించి సోమవారం సందేహాలతో వస్తే వాటిని నివృత్తి చేస్తాం. తర్వాత ట్రాక్-షీట్ ప్రణాళికతో పాఠ్యాంశాలు కొనసాగుతాయి.

సిలబస్ పూర్తిచేయడంలో ఏ విధానం పాటిస్తారు?

ఇతర సంస్థల వలే సిలబస్ త్వరగా పూర్తి చేయాలని తొందరపడం. విద్యార్థులందరికీ పూర్తిగా అర్థమైన తర్వాతనే ముందుకు వెళ్తాము.

కళాశాలలో విద్యార్థులను ఎలా విభజిస్తారు?

విషయాన్ని అర్థం చేసుకోవడం, నేర్చుకునే వేగం ఆధారంగా విద్యార్థులను సెక్షన్లుగా విభజిస్తాము. ఒక్కో సెక్షన్‌లో గరిష్టంగా 26 మంది విద్యార్థులు ఉంటారు.

ఈ విధానం ఖర్చుతో కూడుకున్నది కాదా?

అవును. ఈ నమూనా నిర్వహణ ఖరీదైనది. కానీ మంచి ర్యాంకులు సాధించే నాణ్యమైన విద్యార్థులను తయారు చేయగలుగుతున్నాం. వేలాది మందిలో కొందరికి ర్యాంకులు అందరూ విజయవంతం కావాలన్నదే లక్ష్యం

ర్యాంకులు రాని విద్యార్థులను ఎలా తీర్చిదిద్దుతారు?

ర్యాంకులు సాధించిన విద్యార్థులు ప్రతిష్టాత్మక సంస్థల్లో చేరగా, మిగిలిన విద్యార్థులందరూ బిట్స్ పిలాని, విఐటి వెల్లూరు, అమృత, ఎస్ఆర్ఎం, గీతం వంటి ప్రైవేట్ లేదా డీమ్డ్ విశ్వవిద్యాలయాలలో 90శాతం వరకు భారీ డిస్కౌంట్లతో సీట్లు పొందారు. కొందరికి ఉచిత ప్రవేశం కూడా లభించింది.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఎలా అందిస్తారు?

పరిశ్రమ నిపుణులు, ఇంజనీర్లు, వైద్యులు, వ్యాపార నిపుణులను ఆహ్వానించి, అందుబాటులోని వివిధ అవకాశాలపై విద్యార్థులకు తెలియజేస్తాం.. మంచి శిక్షణ, కౌన్సెలింగ్ అందిస్తాము.

పరీక్షల్లో కాపీయింగ్‌ను ఎలా నివారిస్తారు?

వారాంతపు పరీక్షల్లో ఒకే ప్రశ్నపత్రంతో ఒకరిపక్కన మరొకరు కూర్చుని పరీక్ష రాస్తున్నప్పటికీ, చూసి రాతలకు ఆస్కారం లేకుండా విద్యార్థులు స్వీయపరిణితి ఉండేలా చేస్తాం. వారి బాధ్యతలు, లక్ష్యాలను పదేపదే గుర్తుచేసే ఆస్కారం లేకుండా తీర్చిదిద్దుతాం.

కళాశాల వాతావరణం ఎలా ఉంటుంది?

క్యాంపస్‌లో ప్రశాంతమైన గురుకుల విద్యా విధానాన్ని అనుసరిస్తాం. సంస్థను 'జ్ఞాన మందిరం'గా భావించేలా విద్యార్థులకు నేర్పుతాము.

మీ కళాశాల చాలా ఖరీదైనదని అంటారు. ఇది నిజమేనా?

నిజం కాదు. నగరంలోని ఇతర ఐఐటి, నీట్ అకాడమీల వలే ఉంటుంది. అత్యుత్తమ విజయశాతాన్ని కలిగి ఉంది. ఇతర సంస్థల్లో బ్రిడ్జి కోర్సులకు డబ్బులు చెల్లించినా, ఒకసారి మా క్యాంపసును సందర్శించండి, కళాశాలలోని ఏ విద్యార్థినైనా లేదా తల్లిదండ్రులనైనా ఫీడ్ బ్యాక్ అడగండి, తర్వాత నిర్ణయం తీసుకోండి. పిల్లల భవిష్యత్తును సీరియస్‌గా ఉంటే, క్యాంపస్ సందర్శన మిస్ కావద్దు.. మా సంస్థ ప్రకటనలపై ఎక్కువగా పెట్టుబడి పెట్టలేదు. మౌఖికంగానే మా కాలేజీ కీర్తి వ్యాపిస్తోంది.

కార్మిక విజయ గీతిక మేడే

(కొనసాగింపు) ఉపాధి, సామాజిక న్యాయం కోసం, మెరుగైన జీవన విధానం కోసం మేడే స్ఫూర్తితో కార్మికవర్గం పోరుబాటకు సిద్ధం కావడమే తక్షణ కర్తవ్యం.

ప్రపంచీకరణ, సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రయివేటీకరణ పేరుతో నయా సామ్రాజ్యవాద శక్తులు కార్మికలోకానికి సరికొత్త సవాళ్లు విసురుతున్నాయి. నాటి కార్మిక లోకం త్యాగఫలితంగా సాధించుకున్న హక్కులకు తీవ్ర భంగం వాటిల్లుతోంది. ప్రభుత్వాలు ఒకటొకటిగా హక్కులను హరించివేస్తున్నాయి. ప్రపంచంలోని అన్ని దేశాలూ కార్మికుల మీద ముప్పేట దాడులను ఎక్కుపెడుతున్నాయి. ఎస్ఇజెడ్‌ల పేరిట బానిసత్వ పనిదినానికి నాంది పలుకుతున్నాయి. నాటి 16 గంటల, 12 గంటలు పనిదినానికి వ్యతిరేకంగా పోరుటాన్నెక్కిపెట్టి సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినాన్ని తిరిగి 12 గంటలకు మార్చేందుకు ఇప్పటికే కుట్ర జరిగింది. కార్మిక చట్టాలను యాజమాన్యాల ప్రయోజనాల కనుగుణంగా సవరిస్తున్నారు. సంఘటిత శక్తిగా ఉంటే కార్మికలోకాన్ని ఎదుర్కొనలేమని భావించి అసంఘటిత రంగాన్ని ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రయివేటు సంస్థల్లో కూడా కాంట్రాక్టీకరణ, అవుట్ సోర్సింగ్ పెరుగుతోంది.

ప్రభుత్వరంగ సంస్థలు, పరిశ్రమల్లో ఉద్యోగ నియామకాలకు ఎప్పుడో తిలోదకాలిచ్చేశారు. ఉద్యోగ విరమణ జరిగిన ఖాళీలకు భర్తీ చేయడం లేదు. కారుణ్య నియామకాల ఊసు ఎత్తకపోవడంతో మరణించిన ఉద్యోగుల కుటుంబాలు వీధినపడుతున్నాయి. నాలుగో తరగతి ఉద్యోగాలకు తిలోదకాలిస్తున్నారు. దీంతో అసంఘటితరంగ కార్మికుల సంఖ్య పెరుగుతోంది. ఉదారవాద విధానాల వల్ల దేశంలో 50 లక్షలకుపైగా సంఘటిత రంగంలో ఉద్యోగాలు రద్దయిపోయాయి. ప్రస్తుతం దేశంలో 94.7 శాతం మంది అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. వీరికి కనీస వేతనాలు, పని గంటలు లేవు. బోనస్, పిఎఫ్, ఇఎస్ఐ వంటి కనీస సదుపాయాలు అమలు కావడం లేదు. సమానపనికి సమాన వేతనాలు లభించడం లేదు. వేతనాల మధ్య వ్యత్యాసం పెరుగుతోంది. కూర్చొని అజమాయిషీ చెలాయించేవారికి వేలల్లో, లక్షల్లో వేతనాలు లభిస్తే, రక్తాన్ని చెమటగా మార్చి సంపదను సృష్టిస్తున్నవారికి అర్ధాకలి బతుకే గతవుతోంది. చాలీచాలని వేతనాలతో దుర్భరజీవనం గడుపుతున్న అసంఘటిత కార్మికులను ఆదుకోవడానికి ప్రభుత్వాలు ఎటువంటి సంక్షేమ చర్యలూ చేపట్టడం లేదు. కనీస హక్కుల కోసం, వేతనాల కోసం ఉద్యమిస్తున్న వారిపై ప్రభుత్వం దారుణమైన అణచివేతకు పాల్పడుతోంది. కార్మికుల హక్కులను కాపాడటం కోసం ఏర్పాటు చేసిన లేబరు డిపార్టుమెంట్‌ను నిర్వీర్యం చేస్తున్నారు. ప్రత్యేక ఆర్థిక మండళ్లలోకి కార్మికశాఖ అధికారులను అనుమతించడం లేదు. కార్మికుడికి కష్టం కలిగితే చెప్పుకునే దిక్కులేకుండా చేస్తున్నారు. సంఘాలను పెట్టుకుంటే విధుల్లోంచి తొలగిస్తున్నారు. ఇటువంటి కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు సుందరయ్య జయంతి కూడానూ..

ఆంధ్రాలో అరుణతార వెలసింది మేడే నాడే. విప్లవానికి, దేశంలో కమ్యూనిస్టు నూతన చరితకు ఊపిరిలూదిన పోరు శిఖరం పుచ్చలపల్లి సుందరయ్య జననం విశ్వ కార్మికులు హక్కుల పండగ చేసుకుంటున్న మేడే నాడే. ఈ రెండూ కాకతాళీయమే అయినా చరిత్రకు ఒక నూతన అధ్యాయమైంది. శ్రామికుల వెన్నుతట్టి వెన్నంటి నిలిచి హక్కుల కోసం విప్లవ నినాదం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య అడుగులు పీడిత తాడిత, బడుగుల గుండెల్లో.. జాతి చరిత్రలో చిరస్మరణీయమైనవిగా నిలిచిపోయాయి. హక్కుల కోసం ఆయన సాగించిన పోరుబాటలో మిగిల్చిన అడుగు జాడలే నేటి పోరాటాలకు వెలుగు దివ్వెలుగా ఉన్నాయి.

1 నుంచి 7 వరకూ ఉత్సవాలు

మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణ కోసం ఉధృతమైన పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని సిఐటియు పిలుపునిస్తోంది. విశాఖ జిల్లాలో మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతోంది. ఈ ఏడాది మేడే సంబరాలను మే 1 నుంచి 7 వరకు వారం రోజులు పాటు ఘనంగా నిర్వహించాలని సంఘం విశాఖ జిల్లా కమిటీ నిర్ణయించింది. అందులో భాగంగా 1న ఉదయం 9.30 గంటలకు దొండపర్తి డిఆర్ఎం కార్యాలయం నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు కార్మిక ప్రదర్శన, అనంతరం సభ జరుగుతాయి. కార్మికులకు పని ప్రదేశాలలో, నివాస ప్రాంతాలలో ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 2, 3 తేదీలలో రక్తదాన శిబిరాలను చేపడతారు. మిగతా రోజులూ బహుముఖ కార్యక్రమాలు ఉంటాయి. కార్మికుల కుటుంబ సభ్యులతో కలిపి మేడే ఉత్సవాలను ఎక్కడికక్కడ నిర్వహించనున్నటు సంఘం విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు.